RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 42 | శనివారం, మార్చి 09, 2024 | పేజీలు : 4

## కెటిఆర్‌తో మల్లారెడ్డి భేటీ... పార్టీ మార్పుపై క్లారిటీ

మాజీ కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను శుక్రవారం కలిశారు. కుమారుడు భద్రారెడ్డితో పాటు కెటిఆర్ తో భేటీ అయ్యారు. గత నెలలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ%ా% మల్కాజిగిరి ఎంపి స్థానానికి తన కొడుకు భద్రారెడ్డి పోటీ చేసేందుకు రెడీగా ఉన్నాడని తెలిపారు. నేడు కెటిఆర్ ను కలిసిన సందర్భంగా భద్రారెడ్డి లోక్ సభ ఎన్నికల్లో తాను పోటీ చేయలేనని చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలవడంపై మల్లారెడ్డి వివరణ ఇస్తూ తన అల్లుడు రాజశేఖర్ రెడ్డికి చెందిన కళాశాల భవనాల కూల్చివేత గురించి కలిసినట్లు మల్లారెడ్డి తెలిపారు. తాను పార్టీ మారడం లేదని కెటిఆర్ తో మల్లారెడ్డి తెలిపారు.

# పాతబస్తీ మెట్రో రైలు ప్రాజెక్టుకు శంకుస్థాపన

**హైదరాబాద్ మార్చి, 8:** హైదరాబాద్ ఓల్డ్ సిటీ ప్రాంతానికి మెట్రో లైనుకు విస్తరించే ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఫలక్ నుమా సమీపంలో ఫరూక్ నగర్ బస్ డిపో వద్ద శిలాఫలకం వేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సహా ఇతర ఎంఐఎం నేతలు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం జేబీఎస్ – ఎంజీబీఎస్ వరకు ఉన్న మెట్రో లైనును ఫలక్‌నుమా వరకు ఇంకో 5.5 కిలోమీటర్లు పొడిగించనున్నారు. ఈ రైలుమార్గంలో 5 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఈ మెట్రో లైను నిర్మాణం కనుక పూర్తయితే సికింద్రాబాద్ నుంచి జేబీఎస్, ఎంజీబీఎస్ మీదుగా పాతబస్తీకి నేరుగా ప్రయాణం చేసే వీలుంటుంది. ఎంజీబీఎస్ నుంచి సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్ గంజ్, ఫలక్ నుమా మెట్రో స్టేషన్లు ఉంటాయి.








అయితే, ఈ విస్తరణ కోసం రూ.2 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. కేటాయించిన నిధుల్లో రూ.వెయ్యి కోట్లు స్థల సేకరణకే ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఓల్డ్ సిటీ మెట్రో అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు పాతబస్తీ మరింత అభివృద్ధి దిశలో దూసుకుపోనుందని రేవంత్ రెడ్డి అన్నారు.

## ఏపీలో పొత్తులపై కొలిక్కిరాని చర్చలు..

# సీట్ల సంఖ్యపై మల్లగుల్లలు

**అమరావతి మార్చి, 8 :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడుపార్టీల మధ్య సీట్ల సంఖ్యపై చర్చలు కొనసాగుతున్నాయి. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిన్న రాత్రి ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రి అమిత్ షా తో జరిపిన చర్చలు కొలిక్కి రాలేదు. దీంతో శుక్రవారం మరోసారి కలవాలని నిర్ణయించుకున్నారు. ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే టీడీపీ, జనసేనల మధ్య సీట్ల 118 చోట్ల సీట్ల పంపకం పూర్తయింది. వీటిలో టీడీపీ 94 స్థానాలు దక్కించుకోగా జనసేన 24 స్థానాల్లో పోటీకి అంగీకారం కుదిరింది.



టీడీపీ 12 ఎంపీ స్థానాలు, జనసేన మూడు స్థానాల్లో పోటీకి ఒప్పందం జరిగింది. మిగిలిన 10 స్థానాలను రిజర్వ్ చేసుకున్నారు. నిన్న జరిగిన చర్చల్లో బీజేపీ 6 పార్లమెంట్, 15 అసెంబ్లీ స్థానాలను కోరుతుండగా 4 పార్లమెంట్, 6 అసెంబ్లీ సీట్లు ఇస్తామని టీడీపీ, జనసేన నేతలు సూచించారు. వీటిపై పీఠముడి పడడంతో శుక్రవారం మరోసారి చర్చలు జరుగనున్నాయి. అమిత్ షా పార్టీ కార్యక్రమంలో బిజీ ఉండడంతో ఈరోజు రాత్రి చర్చలు జరిగే అవకాశముందని సమాచారం.



## ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..

# అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న రేవంత్

హైదరాబాద్: భాగ్యనగర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా మార్గంలో మెట్రో రైలు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రేవంత్ అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. "పాతబస్తీ ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ హైదరాబాద్ సిటీ. పాతబస్తీకి వీలైనంత త్వరగా మెట్రోను తీసుకురావడానికి కృషి చేస్తాం. హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. భాగ్యనగరానికి కృష్ణ, గోదావరి నీళ్ళు, ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చింది ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుంది. 2050 వైబ్రెంట్ పేరుతో అభివృద్ధి చేస్తాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎంని ఓడించాలని ప్రయత్నించాం. కానీ ఆ పార్టీ హైదరాబాద్ ప్రాంతంలో మళ్లీ తన పట్టు నిలుపుకుంది. రాజకీయాలు ఎన్నికల వరకే.. అభివృద్ధి కోసం అందరం కలిసి పని చేస్తాం" అని రేవంత్ అన్నారు.

# రంగంలోకి అమిత్ షా...

## బీజేపీ బూత్ లెవల్ నేతలకు దిశానిర్దేషం



**హైదరాబాద్ మార్చి, 8 :** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ నాయకత్వం దూకుడు పెంచింది. ఇప్పటికే మోడీ ప్రధాని హోదాలో ఆదిలాబాద్, హైదరాబాద్ లో పలు అభివ్రుద్ధి పనులను ప్రారంభించి ఓటర్ల ద్రుష్టిని ఆకర్షించారు. తాజాగా అమిత్ షా త్వరలో తెలంగాణలో పర్యటించబోతున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా దిశానిర్దేశం చేయబోతున్నారు. ఈ నెల 12న హైదరాబాద్ లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే పార్టీ బూత్ అధ్యక్షులు, ఇతర నాయకులను ఉద్దేశించి బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగించనున్నారు. ఎన్నికల నిర్వహణపై సోషల్ మీడియా ప్రభావం దృష్ట్యా ఆయన తన ఒక్కరోజు రాష్ట్ర పర్యటనలో భాగంగా బీజేపీ సోషల్ మీడియా వార్ రూమ్, పార్లమెంట్ ఎలక్షన్ వర్కింగ్ గ్రూప్ సభ్యులతో ఇన్ కెమెరా మీటింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ కె.లక్ష్మణ్ అధ్యక్షతన గురువారం సమావేశమైన తెలంగాణ రాష్ట్ర బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ వచ్చే లోక్ సభ ఎన్నికల్లో వివిధ విధులను పర్యవేక్షించడానికి 39 కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువతపై దృష్టి సారించాలని ఎన్నికల నిర్వహణ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. 'నమో యువ సంకల్పం' కార్యక్రమం కింద ప్రతి గ్రామంలోని యువతతో పార్టీ నాయకులు వీధి కార్నర్ సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, తహసీల్, చిన్న పట్టణాలను ఈ సంకల్ప కార్యక్రమం పరిధిలోకి తీసుకువస్తామని, ఈ సమావేశానికి కనీసం 50 మంది యువతను ఆహ్వానిస్తామని తెలిపారు.

# ప్రధాని మోడీ మహిళా దినోత్సవ కానుక



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు మరి కొద్ది వారాలలో జరగనున్న వేళ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు శుభవార్త చెప్పింది. ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ వంటగ్యాసు సిలిండర్‌పై (ఎల్‌పిజి) రూ. 100 తగ్గిస్తున్నట్లు కేంద్రం శుక్రవారం ప్రకటించింది. తగ్గిన ధర శుక్రవారం అర్ధరాత్రి(తెల్లారితే శనివారం) నుంచి అమలులోకి రానున్నది. 14.2 కిలోల సబ్సిడీ రహిత ఎల్‌పిజి సిలిండర్ ధర దేశ రాజధానిలో రూ. 803గా ఉండనున్నది. స్థానిక పన్నుల దృష్టా ఎల్‌పిజి సిలిండర్ ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉండనున్నది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గిన కారనంగా ఎల్‌పిజి సిలిండర్ ధరను కేంద్రం తగ్గించింది. అయితే పెట్రోల్, డీజిల్ ధరలలో మాత్రం ఎటువంటి మార్పును కేంద్రం ప్రకటించలేదు. గడచిన 23 నెలలుగా వాటి ధరలు స్థిరంగా ఉన్నాయి. దేవమంతటా ప్రజలు ప్రస్తుతం సబ్సిడీ లేని ఎల్‌పిజి సిలిండర్‌నే కొనుగోలు చేస్తున్నారు. అయితే ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాసు కనెక్షన్లు పొందిన పేద మహిళలు, మారుమూల ప్రాంతాలలో నివసించే ప్రజలకు మాత్రం ఎల్‌పిజి సిలిండర్‌పై సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాలలో పడుతోంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్‌పిజి సిలిండర్‌పై రూ. 100 చొప్పున ధరను తగ్గించాలని తన ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని, ముఖ్యంగా ఇది నారీ శక్తికి లబ్ధి చేకూరుస్తుందని ప్రధాని తెలిపారు. గత ఆరు నెలలలో సబ్సిడీ రహిత ఎల్‌పిజి సిలిండర్‌పై ధరను తగ్గించడం ఇది రెండవసారి. గత ఆగస్టులో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్టా ఎల్‌పిజి సిలిండర్‌పై రూ.200 చొప్పున కేంద్ర ప్రభుత్వం ధర తగ్గించింది.

## రాజ్యసభకు నామినేట్ అయిన సుధామూర్తి...

# నారీ శక్తికి నిదర్శనం అంటూ మోదీ ట్వీట్

న్యూఢిల్లీ: ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. సుధామూర్తిని ఎగువ సభకు నామినేట్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు సుధామూర్తికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ కావడం సంతోషకరమైన విషయమన్నారు. సామాజిక సేవలో సుధామూర్తిది స్ఫూర్తిదాయక ముద్ర అని కొనియాడారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్య సహా విభిన్న రంగాలకు సుధా జీ చేసిన కృషి అపారమైనదని ప్రశంసించారు. సుధామూర్తి లాంటి వ్యక్తి రాజ్యసభలో ఉండటం నారీ శక్తికి ఒక శక్తివంతమైన నిదర్శనం అని కొనియాడారు. ఎగువ సభకు నామినేట్ అయిన సుధామూర్తికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె పద్మభూషణ్ – భారతదేశంలో మూడవ–అత్యున్నత పౌర పురస్కారం – గత సంవత్సరం సామాజిక సేవకు మరియు 2006లో పద్మశ్రీని అందుకుంది. ఆమె సరళత మరియు నిజాయితీకి ప్రసిద్ధి చెందిన మూర్తి TELCO (ఇప్పుడు టాటా మోటార్స్)లో ఇంజనీర్‌గా తన వృత్తిని ప్రారంభించారు. ప్రస్తుతం ఆమె ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె ఇంగ్లీష్ మరియు కన్నడ భాషలలో ఫలవంతమైన రచయిత, మరియు ఆమె పుస్తకాలు అన్ని ప్రధాన భారతీయ భాషలలోకి అనువదించబడ్డాయి.



# రేవంత్ పట్టుదలతో సీఎం అయ్యారు...

## కాంగ్రెస్ సర్కార్‌కి సహకరిస్తామన్న అసదుద్దీన్

**హైదరాబాద్ మార్చి, 8 :** సీఎం రేవంత్ పట్టుదలతో ముఖ్యమంత్రి పదవిని సాధించారని ఎంపీ అసదుద్దీన్ అన్నారు. పాతబస్తీలో మెట్రో శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో పాటు ఎంపీ అసద్ పాల్గొన్నారు. అనంతరం అసద్ మాట్లాడుతూ.. "సీఎం రేవంత్ ఎంతో పట్టుదల గల మనిషి. రాష్ట్ర ప్రజలు 5 ఏళ్లు అధికారంలో ఉండాలని కాంగ్రెస్‌కి పవర్ ఇచ్చారు. పాతబస్తీ అభివృద్ధిలో కాంగ్రెస్ సర్కార్‌తో కలిసొస్తాం. ప్రజలు సామరస్యంగా కలిసిమెలిసి ఉన్నారు. ఈ సహృద్భావ వాతావరణాన్ని ఇలాగే ముందుకు తీసుకెళ్లాలి. తెలంగాణలో కొన్ని శక్తులు విధ్వంసానికి కుట్రలు పన్నుతున్నాయి. వాటిని అడ్డుకోవాలి. పాతబస్తీ అభివృద్ధికి నిధులు అడగ్గానే రూ.120 కోట్లు మంజూరు చేసినందుకు రేవంత్‌కు ధన్యవాదాలు. మూసీ నది ప్రక్షాళనకు ఎంఐఎం సహకరిస్తుంది.



గరుడ వార్త



## సంపాదకీయం

# ఓబీసీ ముఖ్యమంత్రులు ఎందుకు లేరు?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు గడిచినా బీసీ వర్గాల నుంచి ముఖ్యమంత్రులు లేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీల నుంచి ఒక ముఖ్యమంత్రి వచ్చారు. కానీ 52శాతం ఉన్న ఓబీసీ జనాభాకు మాత్రం ఆ అవకాశం దక్కలేదు. ఈ రోజు దేశంలో ఏపీ, తెలంగాణ మినహా దాదాపు అన్ని రాష్ట్రాలు ఓబీసీ ముఖ్యమంత్రులను చూశాయి. ప్రస్తుతం ఏడు ప్రధాన రాష్ట్రాల్లో ఓబీసీ ముఖ్యమంత్రులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీ వర్గాల నుంచి ముఖ్యమంత్రి రాకపోవడానికి అనేక కారణాలున్నాయి. ఓబీసీలు జనాభాలో 52 శాతం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. అందుకే ముఖ్యమంత్రి పదవి కోసం తమ డిమాండును నొక్కి చెప్పేందుకు వారికి గొంతు లేకుండా పోయింది. వారి జనాభాకి తగిన వాటా దక్కడం లేదు. అంతేగాక వారు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల సంఖ్యకు, వారి జనాభాకు ఎటువంటి సంబంధం లేదు. అలాగే ఓబీసీలలో ఐక్యత, ఓబీసీ స్పృహ లేకపోవడం మరో కారణం. ఓబీసీలలో 136 కులాలు ఉన్నాయి. వీటిని సాంప్రదాయ వ్యవసాయ కులాలు, వ్యవసాయ కులాలపై ఆధార పడిన కులాలు, వృత్తి కులాలు, సేవా కులాలు, సంచార, అర్ధ సంచార (ఆశ్రిత) కులాలుగా విభజించారు. ఈ కులాలు చాలావరకు కడు పేదరికంలో ఉన్నాయి. ఈ కులాలలో నుంచి ఇప్పటివరకు ఒక సభ్యుడు కూడా అసెంబ్లీ గడప తొక్కలేదు. కొన్ని సంఖ్యాపరంగా పెద్ద, ప్రముఖ కులాలు ఓబీసీల్లో ఉన్నాయి. అయితే అక్కడ కూడా 75శాతం కంటే ఎక్కువ జనాభా దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు. గత 76 ఏళ్ళల్లో ఓబీసీ కులాల్లో కొత్తగా మధ్యతరగతి వ్యక్తులు పుట్టుకొచ్చారు. వారు తమ స్వంత కమ్యూనిటీ పేద ప్రజలకు ఉద్దేశించిన చాలా ప్రయోజనాలకు గండి కొడుతున్నారు. అనైక్యత, అధిక నిరక్షరాస్యత, కడు పేదరికం, విభిన్న సామాజిక ఆర్థిక నేపథ్యాల కారణంగా ఓబీసీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారు. ఓబీసీల మధ్య ఐక్యత లేకపోవడంతో అగ్రవర్ణ కులాల రాజకీయ నాయకులు వారిని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు. ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం కూడా బీసీలకు వ్యతిరేకంగానే పని చేసింది. ముఖ్యంగా తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీల హయాంలో అగ్రవర్ణాల నాయకత్వంలో కొనసాగిన సుదీర్ఘ పాలన ఓబీసీ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసింది. ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం 1983 నుంచి 1989 వరకు, 1994 నుంచి 2004 వరకు (మొత్తం పదహారేళ్ళు) తరువాత బీఆర్ఎస్ 2014 నుంచి 2024 వరకు (మొత్తం పదేళ్ళు) పాలించాయి. ఇవి కుటుంబ ఆధారిత పార్టీలు కాబట్టి, వారి కుటుంబ సభ్యులను దాటి మరొకరు ముఖ్యమంత్రి కావడం అసాధ్యం. కొందరు ఓబీసీ నాయకులు స్థాపించి నడిపిన పార్టీలు ఎటువంటి ప్రభావం చూపలేక అనతికాలంలోనే కనుమరుగయ్యాయి అలాగే 1990 నుంచి రాజకీయాలలో '3ఎం'లు మూడు ప్రధాన శక్తులుగా పని చేశాయి: మనీ, మజిల్, మీడియా (డబ్బు, కండబలం, ప్రచార సాధనాలు). ఎన్నికలలో గెలవడానికి వీటి ప్రభావం కీలకంగా మారింది. ఇవి లేని ఓబీసీలు మరింత బలహీనంగా మారారు. రాజకీయాలు, డబ్బు, నేరాలు కలగలిసి పోయినాయి. ఈ తరుణంలో న్యాయ వ్యవస్థ ద్వారా కేసులు వేసి పోరాడేందుకు కావలసిన డబ్బు ఓబీసీలకు లేదు. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కేవలం అగ్ర కులస్థుల చేతుల్లో ఉంది. సోషల్ మీడియా రోజు రోజుకూ పెరుగుతున్నది కానీ నిరక్షరాస్యత కారణంగా ఓబీసీలు ఈ మాధ్యమాన్ని ఎంత శక్తివంతంగా ఉపయోగించుకుంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. జాతీయ పార్టీల వివక్ష కూడా మరొక కారణం. సుమారు 50ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు ఓబీసీని ముఖ్యమంత్రి చేయడానికి పుష్కలంగా అవకాశం ఉంది. వారు ఒక దళితుడిని ముఖ్యమంత్రిని చేసారు కానీ ఓబీసీని ముఖ్యమంత్రి చేయలేదు. ఓబీసీలకు ఆ సోయి లేని సమయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ, పి.శివశంకర్, జి.రాజారాం, సర్దార్ మల్లికార్జున్ గౌడ్ వంటి ఎందరో ఓబీసీ నాయకులు ముఖ్యమంత్రులు కావడానికి వంద శాతం అర్హులైనవారు ఉన్నారు. రెండుసార్లు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ముఖ్యమంత్రి పదవికి పరిశీలించినా అగ్రకుల రాజకీయాల కారణంగా ఇవ్వడానికి నిరాకరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఇదే విధమైన సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులను, అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఓబీసీలు చవిచూశారు. ఆంధ్ర ప్రాంతంలో కూడా ఓబీసీ కులాల ప్రాతినిధ్యం చాలా తక్కువ. సర్దార్ గౌతు లచ్చన్న, ప్రగడ కోటయ్య వంటి ఎందరో పేరొందిన ఓబీసీ నాయకులు ముఖ్యమంత్రి కాలేకపోయారు. ఈ అణగారిన కులాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందజేయటం కోసం, సమానమైన, సమ్మిళిత సమాజాన్ని సృష్టించడం కోసం, రాజ్యాంగపరమైన బాధ్యతను నెరవేర్చడం కోసం వెంటనే సమగ్ర కులగణనతో కూడిన జనాభా గణన అవసరం. అన్ని జాతీయ రాజకీయ పార్టీలు ఓబీసీ సమస్యల పట్ల ఉదాసీనతతో ఉన్నాయి. ఈ రాజకీయ పార్టీలు తీసుకుంటున్న నిర్ణయాలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఓబీసీల ప్రయోజనాలకు ప్రమాదకరంగానే ఉన్నాయి.

# ఏపీ తరహాలో జాబ్స్ ఇవ్వాలి

## - 2008 డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్



హైదరాబాద్: గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం సానుకూల నిర్ణయంతోనే ఉన్నప్పటికీ ఉద్యోగాల అంశం మాత్రం కాస్త ఆలస్యమయ్యేట్లు కనబడుతోంది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ఇటీవల సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రికి ప్రభుత్వ సలహాదారులు హర్కర వేనుగోపాల్ రావు లేఖ రాశారు. ఈ క్రమంలోనే వీరికి ఉద్యోగాలిచ్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. 2008లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6వ తేదీన 35 వేల పోస్టులలో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఎస్జీటీ– పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని, బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని ప్రకటించింది.

**ఆ జీవోతో తీవ్ర నష్టం..**


సుమారు 50 రోజుల తర్వాత ఎస్జీటీ– పోస్టుల్లో 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ 2009 జనవరి 29వ తేదీన జీవో నంబర్ 28ను తీసుకొచ్చింది. దీంతో బీఈడీ అభ్యర్థులు కోర్టుకు వెళ్లగా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోర్టు అప్పట్లో తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ– కూడా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని సూచించింది. దీంతో నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం 2010 జూన్ 21న జీవో 27ను విడుదల చేసింది. దీని ప్రకారం అధికారులు నియామక కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాల వారీగా కామన్ మెరిట్ ప్రకారం ఎంపి–కై–న అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించారు.

**ట్రిబ్యునల్‌కు వెళ్లిన డీఈడీ అభ్యర్థులు**

దీంతో డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. జూన్ 28న కౌన్సిలింగ్‌పై స్టే విధించింది. జీవో 28 ప్రకారం 30 శాతం కోటా కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. దీంతో అధికారులు కౌన్సిలింగ్ నిలిపివేశారు. ఆ తర్వాత 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కొత్త మెరిట్ లిస్టు విడుదల చేసి 2010లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో మంచి మార్కులు సాధించినా.. ఉద్యోగం రాక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 3500 మంది బీఈడి అభ్యర్థులు నష్టపోయామంటున్నారు. తమ కలలు కుప్పకూలిపోయాయని ఆవేదన చెందుతున్నారు.

## బీఆర్ఎస్ తప్పులను వెలికితీస్తాం...

# కఠినంగా శిక్షిస్తాం : కొండా సురేఖ



వరంగల్ : పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఉద్యోగులను పట్టించుకోలేదని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించిన ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా.. ముందుగా ఎంజీఎం మహిళా సిబ్బంది అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మీరు అందరూ ప్రభుత్వం గెలుపుకు కారణం అయినందుకు మీరందరికి చెప్పినట్లుగానే ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మీరు నర్సింగ్ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకుని పేషంట్లకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఎంజీఎంకి వచ్చిన ప్రతి పేషెంట్ కి మీ వంతు సేవ తప్పనిసరి అవసరం ఉంటుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. అదేవిధంగా కొంతమందికి నెలల జీతం ఆగిపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఉద్యోగులను కూడా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా వరంగల్ జైలును కూలగొట్టి మల్టీ స్పెషాలిటీ కడతామని చాలా డబ్బు వృధా చేశారని మండిపడ్డారు. తద్వారా ప్రజలకు ఉద్యోగులకు ఎలాంటి మేలు జరగలేదని.. ఎవరైనా సరే ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు ఎన్నో ఉన్నాయి అవి కూడా త్వరలోనే బయటకు తీస్తామన్నారు. ఎంజీఎం ఆసుపత్రిని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# జివో3తో మహిళలకు అన్యాయం: కవిత





హైదరాబాద్: రాజ్యాంగం వచ్చిన తర్వాత మహిళల కోసం అనేక చట్టాలు చేసుకుంటున్నామని ఎంఎల్ సి కవిత తెలిపారు. మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీస్ శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని, ప్రతి యూనివర్సిటీ లో మహిళల సంఖ్య పెరిగిందని, పోటీ పరీక్షల్లో మహిళలే టాప్ లో ఉంటున్నారని ప్రశంసించారు. ఇందిరా పార్క్ వద్ద భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఎంఎల్సీ కవిత ధర్నా చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయం, జిఒ 3ని రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 33 శాతం మహిళ రిజర్వేషన్లు కావాలని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కోరారని, ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ జిఒ3 తీసుకొచ్చి ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిఒ3తో మహిళలకు కేవలం 12 శాతం రిజర్వేషన్లు మాత్రమే వస్తాయని చెప్పారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి సిఎం రేవంత్ రెడ్డి అని, ఒక కోర్టుకు కాకపోతే మరో కోర్టుకు వెళ్లే వ్యక్తి రేవంత్ అని కవిత ధ్వజమెత్తారు. ఈ జివొతో మహిళలకు అన్యాయం జరుగుతుందని, అవసరం అయితే సుప్రీం కోర్టుకు వెళ్తానని హెచ్చరించారు. మహిళలకు వ్యతిరేకంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, పిజిటి, జెఎల్ పోస్టులలో కూడా మహిళలకు అన్యాయం జరుగుతోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను కలవటం లేదని కెసిఆర్ ను విమర్శించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు ప్రజలకు కనడపడం లేదని ప్రశ్నించారు. ఆయన ఢిల్లీ నేతలనే కలుస్తారని, తెలంగాణ ప్రజలను కలవరని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, భారత్ జాగృతి శ్రేణులు పాల్గొన్నాయి.

# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం..



హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. దేశంలోనే అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో మొదటి వరుసలో నిలిచే ఐఐటీ మద్రాస్ తమ విద్య సంస్థలో జరిగే అంట్రపెన్యూరల్ సమ్మిట్ అనే కార్యక్రమంలో ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రతి ఏటా ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంట్రపెన్యూరల్ ఫెస్టివల్ ఈ– సమ్మిట్ లో కీలకోపన్యాసం చేయాలని కోరింది. ఐఐటీ మద్రాస్‌లో ప్రతి ఏటా నిర్వహించే ఈ– సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి అంట్రపెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, పాలసీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తుంది. కేటీఆర్‌కున్న అపారమైన అనుభవాన్ని పురస్కరించుకొని, భవిష్యత్తు అంట్రపెన్యూరల్ ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో ఐఐటీ మద్రాస్ పేర్కొంది. ఐఐటీ మద్రాస్ విద్యార్థులు ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దేశంలోనే అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్ఓ సర్టిఫికేషన్ కలిగిన ఏకైక కార్యక్రమంగా నిలిచింది. రేపు, ఎల్లుండి జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్, హెచ్‌సీఎల్ సహ వ్యవస్థాపకులు అజయ్ చౌదరి వంటి ప్రముఖులు హాజరై ప్రసంగించనున్నట్లు ఐఐటి మద్రాస్ తెలిపింది.

# ముగిసిన ప్రాజెక్టుల పరిశీలన.. మరిన్ని పరీక్షల తరువాతే నివేదిక!




హైదరాబాద్: కాళేశ్వరం అనుబంధ మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నిర్మాణ వైఫల్యాలు, నిర్వహణ లోపాలు ఉన్నట్లు నేషనల్ డ్యాంసేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం అంచనాకు వచ్చింది. ఈ మేరకు బ్యారేజీల డిజైన్లను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి కొలతలు తీశారు. డిజైన్ల మేరకు నిర్మాణాలు జరగలేదనే సందేహం వ్యక్తం చేసినట్లు పక్కా సమాచారం. అయితే భూసార పరీక్షలు, బ్యారేజీకి వాడిన మెటీరియల్‌ను తాము కోరిన విధంగా పరీక్షలు చేసి నివేదికలు ఇవ్వాలని నిపుణుల బృందం రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులను కోరింది. గత రెండు రోజులుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన నేషనల్ డ్యాంసేఫ్టీ అథారిటీ ప్రతినిధి బృందం అనేక సందేహాలు, వైఫల్యాలను గమనించినట్లు తెలుస్తోంది. తొలుత మేడిగడ్డ బ్యారేజీని నిర్మించిన డిజైన్లు పరిశీలించి కొలతలు తీయగా డిజైన్ల మేరకు కొలతలు లేవనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అలాగే మహా రాష్ట్ర వైపున్న మేడిగడ్డ 7వ బ్లాక్, తెలంగాణ వైపున్న 1వ బ్లాక్ భూసారాల్లో వ్యత్యాసం, నీటి ప్రవాహ వేగాల్లో వైరుధ్యాలు ఉన్నట్లు నిపుణుల బృందం పరిశీలనలో తెలిసింది.

వరదల సమయంలోమిగతా బ్లాక్ ల్లో కంటే 7వ బ్లాక్ నుంచి లోతులో గోదావరి ప్రవహించిందనీ, సెకను వేగం 100లశాతం పెరిగిందని నిపుణులు గమనించినట్లు సమాచారం. ప్రవాహ వేగం, సామర్థ్యానికి మించి నీటి నిల్వ ఉండటం కూడా ఒక కారణంగా భావించినట్లు తెలుస్తోంది. భూసారంలో తేడాలున్నట్లు ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్ (ఈ ఆర్ టీ) రిపోర్టు ద్వారా నిపుణుల బృందం గమనించింది. రాఫ్ట్ సీకెంట్ పైల్స్ మధ్య ఇసుక ఏమేరకు ఒత్తిడికి గురయిందనే అంశాన్ని నిపుణుల బృందం పరిశీలించింది. భూసారాల్లో వ్యత్యాసాలున్నప్పుడు నిర్మాణాల్లోతీసుకోవల్సిన జాగ్రతలు తీసుకోలేదనే అభిప్రాయంలో నిపుణుల బృందం ఉన్నట్లు తెలుస్తోంది.

శుక్రవారం సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ జె. చంద్రశేఖర్ సారథ్యంలో ఎన్డీఏ నిపుణుల బృందం సభ్యులు సెంట్రల్ సాయిల్ అండ్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త యుసీ. విద్యార్థి, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త ఆర్ఆర్ పాటిల్, కేంద్ర జలసంఘం డైరెక్టర్లు శివకుమార్ శర్మ, రాహుల్, ఎన్డీఎస్ఏ టెక్నికల్ డైరెక్టర్ అమితాబ్ శాస్త్రవేత్తల బృందం అన్నారం సుందిళ్ల బ్యారేజీతో పాటు సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలను పరిశీలించింది. అన్నారం సీపేజ్ ఏర్పడిన 10 బ్లాక్‌తో పాటుగా 38,28 పియర్లను పరిశీలించింది. దెబ్బతిన్న ప్రాంతాల్లో విస్తృతంగా పరిశోధనలు చేశారు. బుంగలు ఏర్పడగానే తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకుంది. పియర్ల దగ్గర గ్రౌంటింగ్ పనులను పరిశీలించింది. ఎల్ అండ్ టీ ప్రతినిధుల నుంచి ఈ బ్యారేజీలకు సంబంధించిన డిజైన్లను స్వాదీనం చేసుకుని నిర్మాణాల్లో ప్రతి ఇంచును పరిశీలించింది. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ లో పియర్లకు బలం చేకూర్చే డయాఫ్రమ్ వాల్ పరిశీలించారు. అయితే గత వంద సంవత్సరాలుగా గోదావరి, ప్రాణహిత నదుల ప్రవాహవేగం, ప్రాజెక్టు నిర్మాణాలను అధ్యయనం చేసింది. నిపుణుల బృందం బ్యారేజీలను పరిశీలిస్తున్నప్పుడు రాష్ట్రానికి చెందిన అధికారులు, ఎల్ అండ్ టీ ప్రతినిధులను కూడా దగ్గరకు రానివ్వలేదు. అవసరమైన ఫోటోలను స్వయంగా ప్రతినిధి బృందం సభ్యులు తీసుకున్నారు. పోలీసుల సహాయంతో లాంగ్ విజువల్స్ ను డ్రోన్ల సహాయంతో తీసుకున్నారు. నిపుణుల బృందం పరిశీలిస్తున్నప్పుడు ఎవరినీ దగ్గరకు రానీయ కుండా సుమారు కిలో మీటరు పరిధిలోనే ఉంచారు. భారీ సాయుధపోలీసు బలగాల పహారాలో నిపుణుల బృందం శుక్రవారం సాయంత్రం 6.30 గంటల వరకు క్షేత్రస్తాయిలోనే ఉంది. పరిశీలన అనంతరం కావల్సిన నివేదికలను అందివ్వాలని నీటిపారుదల శాఖ అధికారులను నిపుణుల బృందం కోరింది. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్ తొలగించి కొత్తది నిర్మించడమా? లేదా బ్యారేజీ మొత్తానికి మరమ్మతులు చేయాల్సి ఉందా అనే అంశానికి ఈ నిపుణుల బృందం సూచనలు చేయనుంది. పూర్తి స్తాయి నివేదిక నాలుగు నెలల్లో ఇవ్వనున్నట్లు నిపుణుల బృందం ప్రకటించినప్పటికీ అంతకు ముందే మేడిగడ్డ బ్యారేజీ అంశం పై మధ్యంతర నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. తొలివిడత పరిశీలనను పూర్తి చేసిన నిపుణుల బృందం హైదరాబాద్ కు చేరుకుని ఇక్కడి నుంచి ఢిల్లి%ు% వెళ్లనుంది. పరిశీలన అంశాలను ఎన్డీఏస్ తో సంప్రదించి అవసరమైతే మరోసారి క్షేత్ర పరీక్షకు నిపుణుల బృందం రానుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ నుంచి డ్యాంసేఫ్టీ అథారిటీ ఈఎన్సీ నాగేందర్ రావు, అధికారి సరళ ఈనిపుణుల బృందంతో ఉన్నారు.

# త్వరలోనే మహిళందరికీ వడ్డీ లేని రుణాలు : మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ : మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా నల్గొండ పట్టణంలోని పానగల్‌లోని చారిత్రాత్మక పచ్చల ఛాయా సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇక్కడ ఉన్న ఆలయాలకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని చెప్పారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి వడ్డీలేని రుణాలు ఇస్తామని స్పష్టం చేశారు.



# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. ఇక ఏటా జాబ్ క్యాలెండర్!



హైదరాబాద్, మార్చి 8: తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏళ్లకు ఏళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ తరహాలో నిర్ణీత కాలవ్యవధితో ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. ఇకపై ఏటా జనవరి 1వ తేదీన టీఎస్‌పీఎస్సీ, గురుకుల, పోలీసు, వైద్య నియామక బోర్డుల ఆధ్వర్యంలో జాబ్ క్యాలెండర్లు ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోంది. టీఎస్పీయస్సీ గ్రూప్-1, 2, 3, 4లతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల ఖాళీల వివరాలను ప్రకటనలు వెలువరించడం వల్ల నిరుద్యోగులు ప్రణాళికాబద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ప్రామాణిక రాష్ట్రస్థాయి ముసాయిదా జాబ్ క్యాలెండర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీన్ని త్వరలోనే ప్రభుత్వ అనుమతి కోసం పంపించనుంది. ప్రభుత్వం అనుమతి వచ్చిన వెంటనే.. ఈ ఏడాది నుంచే జాబ్ క్యాలెండర్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో ఏటా తెలంగాణలో కూడా రాష్ట్ర జాబ్ క్యాలెండర్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని కొత్త ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించింది. ముందుగా ప్రకటించిన ప్రకారంగా ఆయా విభాగాల్లోని రాష్ట్రస్థాయి ఉద్యోగాలకు ప్రామాణిక జాబ్ క్యాలెండర్ సిద్ధం చేయాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన తరువాత ఏ నెలలో ఏ నోటిఫికేషన్ ఇస్తారు.. ఏయే నెలల్లో పరీక్షలు జరుగుతాయి.. నియామక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందనే విషయాలను అందులో స్పష్టంగా తెలియజేస్తారు. జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన తేదీల మేరకు ఆయా గడువు తేదీల్లోగా నియామకాలు పూర్తవుతాయి. దీనిపై ప్రభుత్వ విభాగాధిపతుల సలహాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీసుకుంటోంది. సర్వీసు నిబంధనలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతోపాటు, ఖాళీల గుర్తింపు, ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులు వంటి తదితర అంశాలను తెలుసుకుంటోంది. జాబ్ క్యాలెండర్ అమల్లోకి వస్తే.. టీఎస్‌పీఎస్సీ, పోలీసు, గురుకుల, వైద్యఆరోగ్య నియామక బోర్డుల నుంచి యేటా ఉద్యోగ ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.

# శ్రీశైలంలో మాత్రమే జరిగే పాగాలంకరణ సేవ గురించి ఈ విషయాలు తెలుసా



మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శ్రీశైలంలో పాగాలంకరణకు ప్రత్యేక విశిష్టత ఉంది. శైవ క్షేత్రాల్లో మరెక్కడా జరగని విధంగా శ్రీశైల జ్యోతిర్లింగమూర్తికి మూడు తరాలుగా చేపడుతోన్న అద్వితీయ సేవనే ఈ పాగాలంకరణ. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో లింగోద్భవకాలాన జరిగే పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. శ్రీగిరి పర్వతాన స్వయంభువై వెలిసిన మల్లికార్జునుడు శ్రీలింగచక్రవర్తిగా ప్రస్తుతించబడుతున్నాడు. ఆగమ శాస్త్రాల్లోని రాజోపచారాల్లో ఛత్రం, చామరం, వాహనం, నృత్యం, గీతం, వాద్యం, మకుటం వంటి ఉపచారాలు నిర్వహించడం సహజం. వీటిలో మకుటం అంటే కిరీటం. దీనికి బదులు తలపాగాను సైతం వినియోగిస్తున్నారు. తాత్వికపరంగా భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనే పంచభూతాలతో ప్రపంచం నిండి ఉంది. పంచభూతాలకు ప్రతీకగా స్వామివారి గర్భాలయ విమాన గోపురానికి మధ్యలో ఉన్న ప్రధాన కలశంతో పాటు నలుమూలలా ఉన్న నాలుగు కలశాలు అని చెప్పవచ్చు. అలాగే వృషభం ధార్మికతకు ప్రతీక అయితే గర్భాలయ ముఖమండంపై ఉన్న నవ నందులు, ఐదు కలశాలకు కలిపి పాగా చుట్టబడుతుంది. 14 లోకాల్లో మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ నిర్వహించే సేవ ఇది. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు అనే భక్తుడి కుటుంబం మూడు తరాలుగా శ్రీశైల మల్లన్నకు పాగాను అలంకరిస్తున్నది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కళ్యాణానికి ముందు పెండ్లి కుమారుడికి తలపాగా చుట్టే ఆచారశైలిని అనుసరించి పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం తరతరాలుగా పాగాలంకరణ సేవ చేస్తున్నారు. ఏడాది పాటు దీక్షలో ఉండి రోజుకు ఒక మూర చొప్పున 365 రోజులు పాగా వస్త్రాన్ని నేస్తారు. మహాశివరాత్రి పర్వదినాన చిమ్మ చీకట్లో దిగంబరులై స్వామివారి గర్భాలయ విమాన కలశాలు, ముఖమండవ నవనందులను కలుపుతూ పాగాలను అలంకరిస్తారు.

మహాశివరాత్రి రోజున మల్లన్న స్వామికి నిర్వహించే పాగాలంకరణను దర్శించడం ద్వారా పరమేశ్వరుడి అనుగ్రహం కలిగి.. ఆ ఏడాదంతా శుభాలు చేకూరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే శ్రీశైలం క్షేత్రానికి వచ్చి అశేష భక్తజనం ఈ ఘట్టాన్ని తిలకిస్తారు.

# మనుగడకే గురిపెడుతున్న మానసిక యుద్ధం




ఊదరగొట్టుట అనే ప్రాపగాండాకు అనుబంధ ఫలితాలు అనే సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయి. జనంలో భయభక్తులను పెంచుకోవడానికి నాయకుడు ఇంద్రుడు చంద్రుడు వీరుడు శూరుడు అని ప్రచారం చేస్తారు. అట్లా చేయగా చేయగా, నిజమే కాబోలు అని ప్రతినాయకుడు అనుకుంటాడు, అంతేకాదు, నిజంగా తాను అరివీర భయంకరుణ్ణేమో అని ప్రచార నాయకుడు కూడా నమ్మడం మొదలుపెడతాడు.

ఇతరుల మీద కమ్మే మాయపొర ఎంతో కొంత తమని కూడా మత్తులో ముంచుతుంది. నరేంద్రమోదీ, ఆయన పార్టీ వారు సామాన్యులు కాదు. ఉత్సాహం, వ్యూహం, ముందుజాగ్రత్త అన్నీ తగుపాళ్లలో ఉన్న మేధాబృందం వారికి ఉన్నది. తమ లక్ష్యసాధన గురించి జాగరూకత ఎంత ఉన్నప్పటికీ, రేపు కూడా తమదే అధికారం, పరమాధికారం అన్న బేఖాతరుదర్పం కూడా వారిలో తరచు పొడుచుకు వస్తోంది. పొగరుగా కనిపించే ఆ ధీమా కూడా వారి చేతిలో ఒక రాజకీయ పాచికే! మొన్న ఆదివారం నాడు కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సాధారణ ఎన్నికలకు ముందు అదే చివరి సమావేశం. మంత్రులు ఎన్నికల ప్రచారాల్లో ఎట్లా ఉండాలి, ఏమేమి జనాలకు చెప్పాలి వంటి సుద్దులు ప్రధానమంత్రి తన సహచరులకు చెప్పారు. అది సరే. మరోసారి అధికారంలోకి వచ్చాక మొదటి వందరోజుల కాలంలో ఏమి చేయాలో మోదీ చర్చించారట. తన ప్రభుత్వమే వస్తుందని, తాను ప్రధాని అవుతానని అనుకోవడం ఓకే. సంభావ్యత అధికంగా ఉన్న విషయం అది. కానీ, ఈ మంత్రివర్గమే ఉండకపోవచ్చు కదా? అయినా, ప్రస్తుతం ఇంత హడావిడి నడుస్తుండగా, నూతన ప్రభుత్వమూ నూరురోజులూ అన్న మేధోమథన కార్యక్రమం ఎందుకు? వికసిత భారతాన్ని సాధించాలనే లక్ష్యం ప్రధానమంత్రిని ఆత్రుత పెడుతోంది అనుకుందాం, అందుకు సమయం సందర్భం చూసుకోనక్కరలేదా? నిజంగా, ఆ అంశం గురించి చర్చించడంలో పెద్ద విశేషం ఏమీ లేదు. అట్లా చర్చించినట్టు బయటకు చెప్పుకోవడంలోనే అసలు కిటుకు ఉన్నది. విశ్వసనీయవర్గాల ద్వారా బయటకు పొక్కిన ఆ రహస్యం ద్వారా ప్రతిపక్షాలు ఏమి అనుకోవాలంటే, మోదీ గారు గెలవడమే కాదు, మరో హయాం పాలన కూడా ఆరంభించారు, భవిష్యత్తు వర్తమానంలోకి చొచ్చుకు వచ్చేసింది, అని. ఇక ప్రజలు ఏమి అనుకోవాలంటే, చూశారా, మోదీ ఎప్పుడూ దేశ వికాసం కోసమే ఆలోచిస్తారు, ఆయన ప్రత్యర్థులే రాజకీయాలు చేస్తున్నారు, అని. ప్రతిపక్షాల మీద మానసికయుద్ధంలో మోదీ బ్రహ్మాస్త్ర ప్రయోగం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే మొదలయింది. సాధారణంగా, ఇటువంటి బడ్జెట్‌లు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతాయి. చాలాసార్లు, ప్రభుత్వాలకు తామే మళ్లీ గెలుస్తామన్న నమ్మకం నూటికి నూరుపాళ్లు ఉండదు. అందుకని, ఎన్నికల ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో యథేచ్ఛగా వరాలు, వాగ్దానాలు గుప్పిస్తారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే అవన్నీ అమలుచేస్తామన్న వాగ్దానం ఆ బడ్జెట్ ఇస్తుంది. కానీ, మోదీ ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఏ మాత్రం 'జనాకర్షణ' లేని విధంగా రూపొందించింది. తామే తిరిగి అధికారంలోకి వస్తామని అనుకుంటున్నారు కాబట్టి, అమలు చేయగలమా లేదా అన్న విచికిత్స వారి మీద పనిచేసింది. ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది. తెలంగాణలో కూడా అదే మానసిక యుద్ధతంత్రం నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ అంతరించిపోతుందని బీజేపీ అంటుంది. ఆరునెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ అంటుంది. బీజేపీ బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని అసెంబ్లీ ఎన్నికల నాటి పాతపాటే కాంగ్రెస్ పాడుతుంది. ఎన్నికల ప్రచారానికి ఏవో వివాదాంశాలు అవసరం అవుతాయి. కానీ, తెలంగాణలో ఉన్న ప్రస్తుత వాతావరణం, ప్రభుత్వాల, పార్టీల మనుగడలనే చర్చలోకి తెచ్చింది. జాతీయ రాజకీయ సమరంలో తలపడుతున్న రెండు జాతీయపార్టీలు, మొన్నటిదాకా పదేళ్లు అధికారంలో, మరో పదమూడేళ్లు ఉద్యమంలో ఉన్న ప్రాంతీయపార్టీ, తమ తమ శక్తియుక్తులన్నిటిని ఉపయోగించి, ఎన్నికల గండాన్ని దాటడానికి ప్రయత్నిస్తున్నాయి. నిజానికి, ఈ ఎన్నికలు బీజేపీకి గండం కావు. ఈ ఎన్నికల ఫలితాల వల్ల కొత్తగా ఏ నష్టమూ పొందనిది బీజేపీ ఒక్కటే. ప్రస్తుతం ఉన్న స్థానాలను నిలుపుకున్నా చాలు. కాంగ్రెస్ అనుకూలత నేపథ్యంలో కూడా తన బలాన్ని కాపాడుకున్నట్టు అవుతుంది. అదనంగా స్థానాలు గెలుచుకుంటే, పురోగమిస్తున్నట్టు లెక్క. సగానికి పైగా గెలిస్తే, ఆపైన తిరుగుండదు. ఉన్న సీట్లకు తగ్గితే కూడా, అర్థం చేసుకోదగ్గ పరిణామమే తప్ప, పెద్ద పతనం కాదు. కాబట్టి, బీజేపీ ఒక సౌకర్యవంతమైన స్థితినుంచి పోరాటంలోకి దిగుతోంది. దాని ప్రయత్నం అంతా మెరుగుదల కోసమే. ఆ మెరుగుదల వస్తే, రాష్ట్ర రాజకీయాలను కూడా మలుపుతిప్పగలిగిన పరిణామాలకు అవకాశం ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిస్థితి అట్లా లేదు. వాటికి జీవన్మరణ సమస్య. అసెంబ్లీ విజయానికి తగినట్టు, అంతకు మించి విజయాలు రాకపోతే, రేవంత్ రెడ్డికి అధిష్ఠానం దగ్గర రేటింగ్ తగ్గవచ్చు, లేదా, ఇంటిపోరు అధికం కావచ్చు. తమకు మంచి గెలుపు రావడం ఒక్కటే సరిపోదు, బీఆర్ఎస్‌కు అనూహ్యమైన విజయాలు ఏమీ రావు కానీ, బీజేపీకి అదనపు బలం సమకూరకూడదు. కాంగ్రెస్ పది గెలిచి, తక్కినవి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం దక్కించుకుంటే ఓకే. అట్లా కాకపోతే, అదనపు గెలుపులతో బీజేపీలోకి వలసలు పెరిగిపోతాయి. కొందరు నిబద్ధులు ఉన్న మాట నిజమే కానీ, బీఆర్ఎస్ శా??సన?సభ్యులు అనేకులు తమకు ఉన్నచోట భవిష్యత్తు లేదన్న చింతలో పడిపోయారు. వారికి సహజంగానే బీజేపీ ఒక ఆకర్షణీయ గమ్యంగా కనిపిస్తుంది. ఇక అప్పుడు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు అనుమతించాలన్న తాత్విక ప్రశ్న బీజేపీ ఢిల్లీ పెద్దలలో తలెత్తవచ్చు. బీఆర్ఎస్‌ది ప్రస్తుతానికి దయనీయ పరిస్థితే. లోక్‌సభ ఎన్నికలలో ప్రచారాంశమే లేని పార్టీ ఇది. కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి అయినా, బీజేపీకి వేయడానికి అయినా ఓటరుకు తగిన కారణాలున్నాయి. మరి బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీకి పోయి ఏమి సాధిస్తారు?

అట్లాగని, ఎన్నికలను వదులుకోలేరు. మొన్నటి ఎన్నికలలో బలం చూపిన చోట్ల అయినా, ఎంపీలను గెలిపించుకోవాలి. లేకపోతే, ఎమ్మెల్యేల బలగాన్ని నిలుపుకోవడం కష్టం. కానీ, గత పదేళ్ల దాని పరిపాలనా కాలాన్నే కాంగ్రెస్ వివాదాస్పదం చేస్తున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల కాలం ఎడారిలాగా కనబడుతుంటే, పార్టీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి కూడా బీఆర్ఎస్ వేట ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. బీజేపీ మీద కాకుండా, రేవంత్ రెడ్డి తన అస్త్రాలన్నిటినీ బీఆర్ఎస్ మీద ఎందుకు గురిపెడుతున్నట్టు? బీఆర్ఎస్ లక్ష్యం కూడా రేవంత్ మాత్రమే ఎందుకు అవుతున్నారు? బీఆర్ఎస్ నుంచి సిద్ధంగా ఉన్న వలసలను కాంగ్రెస్ ఎందుకు ఆపుతున్నది? అదనపు బలాన్ని సమకూర్చుకుని, ఆత్మవిశ్వాసంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్లకుండా, దిగువశ్రేణి నేతల వలసలతోనే ఎందుకు తృప్తి చెందుతున్నట్టు? ఎన్నికల తరువాత బలం పెంచుకుందామనుకుంటున్నారేమో కానీ, అప్పటికి బీఆర్ఎస్ శిబిరంలో ఎవరైనా మిగులుతారా? ప్రధానమంత్రి పర్యటనలో రేవంత్ వ్యవహరించిన తీరు కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా? తెలంగాణ అస్తిత్వ స్పృహ రేవంత్‌లో కనిపించడం లేదన్న విమర్శ బీఆర్ఎస్ తిరిగి ఉద్యమ ఉద్వేగాలను ఆశ్రయించనున్నట్టు సూచిస్తోందా? మోదీ చెప్పిన సర్జికల్ స్ట్రయిక్ అంతరార్థమేమిటి? ఇంతకీ, లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణలో ప్రధాన పోటీ ఏ రెండు పార్టీల మధ్య? ఇవన్నీ తెలంగాణ రాజకీయరంగాన్ని కుదిపివేస్తున్న ప్రశ్నలు.

# జీరో బిల్లులు ఎప్పుడొస్తాయ్?




**ఇబ్రహీంపట్నం :** మార్చి ఒకటి నుంచి పేదలకు జీరో(0) బిల్లులు గాకుండా ఎప్పటిమాదిరగానే కరెంటు బిల్లులు వచ్చాయని, దీంతో జనం అయోమయంలో ఉన్నారని మంగళవారం ఇబ్రహీంపట్నం మండలపరిషత్ సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లరేషన్ కార్డులున్నా కొందరికి వందల్లో బిల్లు వచ్చింది వాస్తవమేనని, మున్ముందు వీటిని సరిచేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు సమాధానమిచ్చారు. 200 యూనిట్ల వరకు పేదలు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ చెల్లించినా వచ్చే బిల్లుల్లో వారి ఖాతాలో జమ చేస్తామని ఆయన చెప్పారు. ఏవైనా అనుమానాలుంటే తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు రసీదు, కరెంటు కనెక్షన్ నంబర్‌ను విద్యుత్ కార్యాలయంలో అందజేస్తే జీరో బిల్లుకు ఎంటర్ చేస్తామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కృపేశ్, వైస్‌ఎంపీపీ వెంకటప్రతాపరెడ్డి అధికారులకు సూచించారు. కరోనాకు ముందు ఇబ్రహీంపట్నం నుంచి పొల్కంపల్లి, అనాజ్‌పూర్ మీదుగా హయత్‌నగర్‌కు బస్సులు నడిచేవని, నిలిపేసిన వాటిని పునరుద్ధరించాలని ఎంపీటీసీ మంగ అధికారులను కోరారు. మండలంలో మొత్తం 37 రేషన్ షాపులకు అనుమతి ఉండగా ప్రస్తుతం ఏడు చోట్ల ఖాళీలున్నాయని, వీటని భర్తీ చేస్తామని డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఖాళీచోట్ల ఇన్‌చార్జిలతో బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం మండలంలో 1,135 మంది కూలీలు పనిచేస్తున్నారని ఏపీవో తిరుపతాచారి తెలిపారు. మండలంలో ఉపాధి కింద ఇప్పటికి రూ. 5.12కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన వివరించారు.

# ఎంపీ టికెట్ కోసం అన్ని పార్టీల్లో ఆశావహుల యత్నాలు



నల్లగొండ : లోక్‌సభ సీట్లకు అభ్యర్థుల ఎంపిక కొలిక్కివస్తుండడం తో ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఉమ్మ డి జిల్లాలోని రెండు సీట్లకూ మూడు ప్రధాన పార్టీల నుంచి బలమైన నేతలు టికెట్ ఆశిస్తుండడం, గెలుపే లక్ష్యంగా పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తుండడంతో టికెట్ ఎవరికి దక్కుతుందనే అంశంపై రోజుకో సమీకరణం తెరమీదకు వస్తోంది. బీజేపీ తొలిజాబితాలో భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌కు టికెట్ కేటాయించడం, మరోవైపు బీఆర్ఎస్ నుంచి సైతం రెండింటిలో ఒక స్థానంలో బీసీ లేక ఎస్టీ వర్గానికి చెందిన నేతలకు టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదనలు అధిష్ఠానం ముందుకు చేరగా, అధికార కాంగ్రెసలోనూ సామాజిక స్వరం వినిపిస్తోంది. రేపోమాపో టికెట్ ఖరారవనుండడంతో ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు ఎం పీ సీట్లను భారీ మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంతో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభ్యర్థుల ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని, ఎవరికి టికెట్ ఇవ్వాలనే అంశం లో నేతలిద్దరూ ఇప్పటికే అధిష్ఠానానికి స్పష్టమైన ప్రతిపాదనలు చేశారనే చర్చ పార్టీలో సాగుతోంది. రేపోమాపో అభ్యర్థుల ప్రకటన ఉంటుందనే చర్చ నేపథ్యంలో ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుం చి పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డికి లైన్‌క్లియర్ అయినట్లేనని చర్చసాగుతోంది. మరో వైపు పీసీసీ ప్రధాన కార్య దర్శి పటేల్ రమేషరెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు గుమ్ముల మోహన్‌రెడ్డి సైతం టికెట్‌పై ధీమాగా ఉన్నారు. భువనగిరి స్థానం నుంచి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పోటీకి ఆహ్వానించామని మంత్రి కో మటిరెడ్డి ప్రకటించినా, రాహుల్‌గాంధీ పోటీ చేయకపోతే మంత్రి కుటుంబానికి చెందిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సతీమ ణి కోమటిరెడ్డి లక్ష్మి, లేదా మంత్రి సోదరుడి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డిలో ఒకరికి టికెట్ దక్కుతుందనే చర్చసాగుతోంది. ఇదే స్థానం కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీసీ నినాదంతో చెనగాని దయాకర్‌గౌడ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎవరిని బరిలో దింపాలనే అంశంపై ఆ పార్టీ అగ్రనేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి రెండు సీట్లలో ఏదో ఒక చోట తనకు పోటీచేసే అవకాశం దక్కుతుందనే ధీమాతో ఉన్నారు.

# జుల్ఫీకర్ భుట్టోకు న్యాయం జరగలేదు.....



**ఇస్లామాబాద్ :** 44ఏళ్ళ నాటి హత్య కేసులో ఉరిశిక్ష పడిన పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫీకర్ అలీ భుట్టోకు న్యాయం జరగలేదని పాకిస్తాన్ సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. 12ఏళ్ళ క్రితం దేశాధ్యక్షుడు జర్దారీ చేసిన ప్రస్తావనపై విచారణ ముగించిన అనంతరం ప్రధాన న్యాయమూర్తి క్వాజి ఫాయిజ్ ఇసా మాట్లాడుతూ, ఆనాటి కేసు విచారణ సందర్భంగా ఆయనపై సక్రమంగా, పారదర్శకంగా విచారణ జరిగిందని, అనుసరించాల్సిన పద్దతులన్నీ అనుసరించారని తాము భావించడం లేదని చెప్పారు. 1979 ఏప్రిల్ 4న రావల్పిండిలోని ఒక జైల్లో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) వ్యవస్థాపకుడైన భుట్టోను ఉరి తీశారు. రాజకీయ ప్రత్యర్థి హత్యలో ప్రధాన పాత్ర పోషించారంటూ సుప్రీం కోర్టు ఆయన్ని దోషిగా పేర్కొంది. ఆ తర్వాత రెండు మాసాలకు ఉరిశిక్ష అమలైంది. జుల్ఫీకర్ భుట్టోను సైనిక నియంత జనరల్ మహ్మద్ జియా ఉల్ హక్ అధికారం నుండి తొలగించిన రెండేళ్ళ తర్వాత ఆయనకు ఉరిశిక్ష పడింది. ఆ తర్వాత రెండు మాసాలకు ఉరిశిక్ష అమలైంది.

## నిష్ఫల డబ్ల్యుటిఓ అబుదాబీ చర్చలు....!


యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబీలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) మంత్రుల పదమూడవ సమావేశం (ఎంసి13) జరిగింది. 166 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నాచితకా అంశాల మీద కొన్ని ఒప్పందాలు జరిగాయి తప్ప కీలకమైన వ్యవసాయం, మత్స్య సంపద సబ్సిడీలు, తదితర అంశాలపై ఎలాంటి ముందడుగు పడలేదు. ఉమ్మడి ప్రకటన కోసం నాలుగవ రోజు మూడు సార్లు సమావేశం వాయిదా పడింది. కుదరలా. మరో రోజు పొడిగించారు. చివరికి మరిన్ని చర్చలు కొనసాగిద్దాం అనే అంశం మీద తప్ప మరొక ఏకాభిప్రాయం లేదు. పేద వర్ధమాన దేశాలు తమ ప్రయోజనాల కోసం పట్టుబడితే, ధనిక దేశాలూ అంతకంటే గట్టిగా ఉడుం పట్టు పట్టాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలలో సంధికాలం నిబంధన (పీస్ క్లాజ్) ప్రకారం మన వంటి దేశాలు యథాతథ స్థితిని కొనసాగించేందుకు లభించిన ఊరట తప్ప కొత్తగా ఒరిగిందేమీ లేదు. వాణిజ్య వివాదాల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉండే విధంగా సంస్కరించాలన్నది ఒక ప్రతిపాదన. ఇప్పుడున్న వ్యవస్థనే పని చేయనివ్వకుండా 2019 నుంచి అమెరికా, దాని వెనుక ఉన్న ఇతర ధనిక దేశాలు మోకాలడ్డుతుండటంతో ఎలాంటి కార్యకలాపాలు లేవు. ఎలక్ట్రానిక్ (ఇ) కామర్స్‌లో జరిగే లావాదేవీలపై సభ్యదేశాలు కస్టమ్స్ సుంకాలు విధించకూడదన్న నిర్ణయాన్ని 1998 నుంచి ప్రతి సమావేశంలో పొడిగించినట్లుగానే అబుదాబీలో కూడా 2026 వరకు అనుమతించారు. ఇది ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న దేశాలకే లబ్ధి చేకూర్చుతుందని వేరే చెప్పనవసరం లేదు. మన వంటి దేశాలు 'ఎప్పుడైనా వాటి సరసన చేరకపోతామా, మార్కెట్లలో ప్రవేశించకపోతామా, మన కార్పొరేట్లకూ లబ్ధి చేకూర్చలేకపోతామా' అనే ఆశతో ఎదురుచూస్తున్నాయి. ఇదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు వర్ధమాన దేశాల సబ్సిడీలకు గండికొట్టేందుకు చూడటంతో పాటు తమ సబ్సిడీలను మరింతగా పెంచుకుంటున్నాయి. వాటిని ప్రతిఘటించే స్థితిలో మిగతా దేశాలు లేవు. అయినా ఎండమావుల వెంట పరుగెత్తినట్లుగా మన వంటి దేశాల పరిస్థితి ఉంది. ఒకవైపు లబ్ధి కోసం రాజీ పడుతున్నాయి, మరోవైపు జనం నుంచి వ్యతిరేకతను చూసి ప్రతిఘటిస్తున్నాయి. మన రైతాంగానికి రక్షణ కల్పించేందుకు గాను కొన్ని పంటలకు కనీస మద్దతు ధర విధానం, ఆహార భద్రతకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) ద్వారా ప్రభుత్వమే ఆహారధాన్యాల సేకరణ విధానాన్ని అమలు జరుపుతున్నాం. ఈ రెండూ కూడా డబ్ల్యుటిఓ నిబంధనలకు విరుద్ధమని వాటిని ఎత్తివేయాలని అమెరికా, ఐరోపా దేశాలు 2013 నుంచి పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నాయి. వాటిని సంతుష్టీకరించేందుకు 2020లో నరేంద్ర మోడీ తెచ్చిన మూడు సాగు చట్టాలు రాజీలో భాగమైతే, రైతుల ప్రతిఘటనతో క్షమాపణలు చెప్పి మరీ తోక ముడవటం రెండోదానికి నిదర్శనం. మొదటిది వాస్తవం, రెండవది వంచన. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించేందుకు మొరాయించటమే దీనికి నిదర్శనం. అంతిమ ఫలితం ఏమంటే ధనిక దేశాల ఒత్తిడే ఎక్కువగా పని చేస్తున్నది. ముందే చెప్పుకున్నట్లుగా సంధికాలం నిబంధన (పీస్ క్లాజ్) ఇంకా అమల్లో ఉన్నందున ఎఫ్‌సిఐ, ప్రజా పంపిణీ వ్యవస్థలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రపంచంలో వివిధ దేశాలు రైతాంగానికి ఏటా లక్ష కోట్ల డాలర్ల మేర సబ్సిడీలు ఇస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశాలు వీటిని ఎత్తివేసి మార్కెట్లో ప్రవేశించే హక్కు తమకు కల్పించాలని పట్టుబడుతున్నాయి. ఇదే సమయంలో నిబంధనలకు వక్రభాష్యాలు చెప్పి పెద్ద ఎత్తున అవి సబ్సిడీలు ఇస్తున్నాయి. ఐరోపా దేశాలు ఇస్తున్న సబ్సిడీలను ఎత్తివేస్తే ప్రపంచంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎనిమిది శాతం పెరుగుతాయని, అది న్యూజిలాండ్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఒక సంస్థ చేసిన విశ్లేషణను న్యూజిలాండ్ ప్రతినిధి ఉటంకించారు. అబుదాబీలో తేలని మరొక అంశం సముద్ర ఉత్పత్తులకు సబ్సిడీలు. ప్రపంచంలో 26 కోట్ల మంది వీటి వేటలో ఉపాధి పొందుతున్నారు. చిన్న స్థాయిలో చేపలను పట్టే దేశాల వారు సబ్సిడీల వలన నష్టపోతున్నారు. ఆయా దేశాల సముద్ర తీరానికి రెండు వందల నాటికల్ మైళ్ల అవతల ఎవరైనా చేపలు పట్టవచ్చు. చైనా, ఐరోపా లోని ధనిక దేశాల దగ్గర భారీ నౌకల ద్వారా చేపలను పట్టే సంస్థలు ఉన్నాయి. వాటితో చిన్నవారు పోటీ పడలేరు. భారీ నౌకలకు వ్యతిరేకంగా వర్ధమాన, పేద దేశాలు తెస్తున్న ఒత్తిడికి ఎలాంటి ఫలితమూ కనిపించటం లేదు. రెండవది సముద్ర ఉత్పత్తుల నిర్వచనాల్లో ఉన్న లొసుగులను ఆధారం చేసుకొని ధనిక దేశాలు వ్యవసాయానికి ఇస్తున్నట్లుగానే వీటికి భారీ సబ్సిడీలు ఇస్తున్నాయి. రెండు సంవత్సరాల క్రితం కుదిరిన ఒప్పందం ధనిక దేశాల సంస్థలకు మేలు చేకూర్చేదిగా ఉంది. చట్టవిరుద్ధంగా, వివరాలు వెల్లడించని, నియంత్రణ విధానం లేకుండా పట్టినవాటికి, పరిమితికి మించి నిల్వలు ఉన్న చేపలకు సబ్సిడీ ఇవ్వకూడదన్న నిబంధనను 2022లో ఆమోదించారు. ఈ ఒప్పందాన్ని నూట పది దేశాలు ఆమోదిస్తేనే అమల్లోకి వస్తుంది, మరొక 39 దేశాలు సంతకాలు చేయాల్సి ఉంది. దీని నిబంధనల్లో ఉన్న లోపాల కారణంగా ఏకీభావం కుదరలేదు. ఈ ఒప్పందం మీద జరిగిన ప్రజా విచారణలో పాల్గొన్న వారు ఇప్పటి వరకు కార్పొరేట్లు భూములను కొల్లగొట్టారని, ఇది అమల్లోకి వస్తే సముద్రాలను ఆక్రమిస్తారని, నియంత్రణలు లేకపోతే దోపిడీకి హద్దే ఉండదని హెచ్చరించారు. పేద దేశాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి వెలుపలికి వచ్చి ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో పెట్రోలియం ఉత్పత్తుల మీద ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేయాలన్న ధనిక దేశాల డిమాండ్‌కు అబుదాబీలో మరో అడుగు ముందుకు పడింది.

## జమిలి ఎన్నికలపై ఈ వారంలోనే లా కమిషన్ నివేదిక....?



న్యూఢిల్లీ : దేశంలో సార్వత్రిక ఎన్నికలు హంగామా ఇప్పటికే ప్రారంభమయింది. కొన్ని పార్టీలు అభ్యర్థుల జాబితాలను కూడా ప్రకటించాయి. మ్యానిఫెస్టోలు, అజెండాలు కూడా సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి ముందే జమిలి ఎన్నికలపై 22వ లా కమిషన్ తన తుది నివేదికను ఈ వారంలోనే న్యాయ శాఖకు సమర్పించే అవకాశాలు కన్పిస్తున్నాయి. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంలో సాధ్యాసాధ్యాలపై లా కమిషన్ తన నివేదికను సమర్పించాల్సి ఉంది. ఈ నెల మూడో వారంలో ఎన్నికల కమిషన్ షెడ్యూలును ప్రకటించవచ్చు. ఈ నేపథ్యంలో దానికి ముందే%ూ%ఈ వారంలోనే లా కమిషన్ నివేదికను సమర్పిస్తుందని కేంద్ర న్యాయ శాఖ వర్గాలు తెలిపాయి. 2029లో దేశంలో పూర్తి స్థాయిలో జమిలి ఎన్నికల నిర్వహణ కోసం జస్టిస్ రితురాజ్ అవస్థి నేతృత్వంలోని లా కమిషన్ పలు రాజ్యాంగ సవరణలు సూచించింది. 1951వ సంవత్సరం నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయడంతో పాటు జమిలి ఎన్నికల నిర్వహణ, ఉమ్మడి ఓటర్ల జాబితా తయారీ కోసం రాజ్యాంగంలో నూతన ఛాప్టర్‌ను రూపొందించాలని సిఫార్సు చేసింది. లా కమిషన్ చేసిన పలు సిఫార్సులను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ఆమోదించినట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల నిర్వహణకు కూడా సుముఖత వ్యక్తం చేసిందని సమాచారం. రాజ్యాంగ సవరణ ద్వారా పార్ట్15-ఏ పేరిట కొత్త ఛాప్టర్‌ను ప్రవేశపెట్టాలని లా కమిషన్ సూచించింది. ప్రస్తుతం రాజ్యాంగంలోని పార్ట్ 15లో ఎన్నికల నిర్వహణ గురించి వివరించారు. నూతన ఛాప్టర్‌లో మూడంచెల జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు ఉంటాయి. 'సమకాలీకరించిన ఎన్నికలు', 'జమిలి ఎన్నికల స్థిరత్వం', 'ఉమ్మడి ఓటర్ల జాబితా' అనే అంశాలకు సంబంధించిన వివరాలను ఈ ఛాప్టర్‌లో పొందుపరుస్తారు.

## జైలు నుంచి విడుదలైన ప్రొఫెసర్ సాయిబాబా



**నాగ్‌పూర్ :** మావోయిస్టులతో సంబంధాలు ఆరోపణలతో అరెస్టయిన ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జిఎన్. సాయిబాబా గురువారం జైలు నుండి విడుదలయ్యారు. ఆయనతో పాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ మంగళవారం బాంబే హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. నాగపూర్ సెంట్రల్ జైలు నుండి నేడు ఆయన విడుదలయ్యారు. బయటకు వచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నా ఆరోగ్యం ఎంతో క్షీణించింది. ప్రస్తుతం మీతో మాట్లాడలేను. నాకు చికిత్స అవసరం. ఆరోగ్యం కుదుటపడిన అనంతరం మీతో మాట్లాడతా'' అని అన్నారు. కుటుంబసభ్యులను కలుసుకున్నారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ 90 శాతం వైకల్యంతో వీల్ చైర్‌కు పరిమితమైన సాయిబాబాను 2014లో మహారాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈ కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కి అప్పగించింది. 2017 మార్చిలో గడ్చిరోలి సెషన్స్ కోర్టు సాయిబాబాకు జీవిత ఖైదు విధించింది. అప్పటి నుండి ఆయన నాగపూర్ సెంట్రల్ జైలులోనే ఉన్నారు. మధ్యలో 2014 నుండి 2016 వరకు బెయిల్‌పై విడుదలయ్యారు.

## రష్యా చెస్ దిగ్గజం కాస్పరోవ్ టెర్రరిస్టా..!




**మాస్కో :** రష్యాలో అధ్యక్షుడు పుతిన్ విమర్శకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సిందే. వారిపై ఆంక్షలు, ప్రాణాంతక దాడులు కోకొల్లలు. తాజాగా చెస్ లెజెండ్ గ్యారీ కాస్పరోవ్‌పై ఆ దేశం కఠిన చర్యలు తీసుకుంది. ఆయన్ను 'ఉగ్రవాదులు, అతివాదులు' జాబితాలో చేర్చింది. ఈ విషయాన్ని స్థానికమీడియా సంస్థ వెల్లడించింది. 60 ఏళ్ల కాస్పరోవ్ చదరంగంలో అనేకమార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచారు. ఆయన రాజకీయంగా తన అభిప్రాయాలను బలంగా వినిపిస్తుంటారు. పుతిన్ విధానాలను ఎండగడుతుంటారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను పలుమార్లు ఖండించారు. ఈ నేపథ్యంలో రోస్‌ఫిన్‌మానిటరింగ్ (రష్యా ఆర్థిక పర్యవేక్షణా సంస్థ) కొద్ది గంటల క్రితం కొత్తగా ఉగ్రవాదుల జాబితాను విడుదల చేసింది. దానిలో గ్యారీ కాస్పరోవ్ పేరును చేర్చింది. అందుకు దారితీసిన కారణాలను మాత్రం వివరించలేదు. ఈ జాబితాలోని వ్యక్తుల బ్యాంకు లావాదేవీలపై ఆంక్షలు ఉంటాయి. వారి ఖాతాలను ఉపయోగించాలనుకున్న ప్రతిసారి అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అణచివేతకు భయపడి 2014లోనే ఆయన దేశం విడిచివెళ్లిపోయారు. దశాబ్దకాలంగా అమెరికాలో ఉంటున్నారు.

## ఒక్క రోజు గాజాలో 86మంది పాలస్తీనియన్ల మృతి



**గాజా :** గాజాలో గత ఐదు మాసాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమంలో మంగళ వారం ఒక్క రోజు వ్యవధిలో 86మంది పాలస్తీ నియన్లు మరణిం చారు. సెంట్రల్, దక్షిణ గాజాల్లో ఇజ్రాయిల్ బలగాలు బాంబులు, శతఘ్ని దాడులతో విరుచుకు పడ్డాయి. రఫా, ఖాన్ యూనిస్ నగరాల్లోని లక్ష్యాలపై కూడా సైన్యం దాడులకు పాల్పడింది. ఖాన్ యూనిస్‌లోని అల్ ఖరారా ప్రాంతంలో బాంబు దాడుల్లో ఇద్దరు మృతి చెందగా, అనేకమంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో మొత్తంగా జనాలు లేకుండా నిర్వీర్యం చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. దాడులను ఉధృతం చేయడం, కరువు కాటకాలు పెచ్చరిల్లేలా చేయడం వల్ల ఉత్తర గాజా నుండి ప్రజలు తరలివెళ్లిపోవాలని చూస్తున్నారని పాలస్తీనా విదేశాంగ శాఖ పేర్కొంది. ఇప్పటికి 152 రోజుల నుండి గాజాపై ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడుతోందని తెలిపింది. ఉత్తర గాజాలో ఐదు లక్షలమందికి పైగా ప్రజలు అత్యంత భయంకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొంది. అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న బాంబు దాడులు, ముంచుకొస్తున్న దుర్భిక్షంతో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపింది. 2021లో 45మంది యూదు యాత్రికులు చనిపోవడానికి దారి తీసిన ఘటనకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యక్తిగత బాధ్యతను వహించాలని ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన కమిటీ తేల్చి చెప్పింది. దీంతో నెతన్యాహుపై ఒత్తిడి పెరుగుతోంది. యాత్రా స్థలంలో కల్లోల పరిస్థితులు నెలకొంటాయని నెతన్యాహు కార్యాలయాన్ని ముందుగానే హెచ్చరించారని, కానీ వాటిని పరిష్కరించడానికి సరైన చర్యలు తీసుకోలేదని దర్యాప్తు కమిటీ భావించింది.

## అధ్యక్ష అభ్యర్థిత్వ రేసు నుంచి వైదొలిగిన నిక్కీ హేలీ




**వాషింగ్టన్ :** అగ్రరాజ్య అధికార పీఠం కోసం జరగబోయే ఎన్నికల్లో మరోసారి అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యర్థులుగా ఉండటం ఖాయమైపోయింది. రిపబ్లికన్ పార్టీ తరపున అభ్యర్థిత్వ రేసు నుంచి వైదొలుగుతున్నట్లు భారత సంతతి నాయకురాలు నిక్కీ హేలీ ప్రకటించారు. సౌత్ కరోలినాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. "నా క్యాంపెయిన్‌ను నిలిపివేయాల్సిన సమయం వచ్చింది. అమెరికన్లు తమ గళాన్ని వినిపించాలని కోరుకుంటున్నానని చెప్పేదాన్ని. నేను ఆ పని చేశా. నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. ఇకపై అభ్యర్థిని కానప్పటికీ.. నమ్మిన అంశాలపై మాత్రం గళాన్ని వినిపించడం ఆపను" అని చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు అభినందనలు తెలిపిన హేలీ.. అందరి ఓట్లు సంపాదించేలా చూసుకోవాలని ఆయనకు సలహా ఇచ్చారు. సౌత్ కరోలినా మాజీ గవర్నర్, యూఎన్ అంబాసిడర్ అయిన నిక్కీ హేలీ.. ట్రంప్‌ను సమర్థిస్తారా లేదా అనే అంశంపై మాత్రం తుది నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు, హేలీకి సన్నిహితంగా ఉండే వ్యక్తులు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఆమె ట్రంప్‌నకు మద్దతు ఇవ్వడం మంచిదని కొందరు భావిస్తుంటే.. మరికొందరు మాత్రం ఆయన్ను ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, మంగళవారం జరిగిన 'సూపర్ ట్యూస్‌డే ప్రైమరీల' పోరులో హేలీ ఓడిపోయారు. రిపబ్లికన్ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వానికి ఎంపిక కావడానికి 1,215 మంది ప్రతినిధుల మద్దతు కావాల్సి ఉంటుంది. నేటి ఫలితాల తర్వాత ట్రంప్‌నకు 995 మంది మద్దతు ఉండగా.. హేలీ ఖాతాలో 89 మంది మాత్రమే ఉన్నారు. ట్రంప్‌తో పోలిస్తే భారీ వెనుకంజలో ఉన్న ఆమె.. పోటీని విరమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే నిక్కీ హేలీ తాజాగా ప్రకటన చేశారు. ప్రైమరీ ఎన్నికల్లో ఆయనకు పోటీగా.. హేలీ, వివేక్ రామస్వామితో పాటు డజను మందికి పైగా బరిలోకి దిగారు. నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. ఇకపై అభ్యర్థిని కానప్పటికీ.. నమ్మిన అంశాలపై మాత్రం గళాన్ని వినిపించడం ఆపను" అని చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు అభినందనలు తెలిపిన హేలీ.. అందరి ఓట్లు సంపాదించేలా చూసుకోవాలని ఆయనకు సలహా ఇచ్చారు. సౌత్ కరోలినా మాజీ గవర్నర్, యూఎన్ అంబాసిడర్ అయిన నిక్కీ హేలీ.. ట్రంప్‌ను సమర్థిస్తారా లేదా అనే అంశంపై మాత్రం తుది నిర్ణయం తీసుకోలేదు.

# ఈ జ్యూస్‌లు తాగడం వల్ల ఒంట్లో వేడి మాయం.....?




ఎండాకాలం వస్తుందంటేనే చాలా మంది భయపడుతూ ఉంటారు.కొంతమందికి ఎండాకాలంలో వచ్చే వేడిని వడదెబ్బని తట్టుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. కొంతమందికి విపరీతంగా చెమటలు పోస్తూ ఉంటాయి.ఇలాంటప్పుడు ఒంట్లో నీటి శాతం తగ్గి అలసటగా ఉంటుంది.ఈ అలసట సమయంలో వట్టి వాటర్ తాగితే పెద్దగా ప్రయోజనం ఉండదు.ఇప్పుడు మనం చెప్పుకోబోయే ఈ నాలుగు రకాల జ్యూస్లు తీసుకోవడం వల్ల ఒంట్లో నీరసం తగ్గి అలసట తీరుతుంది.మరి అవేంటో చూద్దామా. మొదటిది సగ్గుబియ్యం తో చేసిన జావా.సగ్గుబియ్యంలో వేడిని తగ్గించే గుణాలు చాలా ఉన్నాయి.అందువల్ల ఈ సగ్గుబియ్యం తో చేసిన జావా తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది.ముందుగా స్టవ్ వెలిగించి ఒక గిన్నె తీసుకొని మూడు గ్లాస్ లు వాటర్ పోసి వాటర్ బాగా వేడెక్కి తెర్లుతూ ఉన్నపుడు ఒక టీ గ్లాస్ సగ్గుబియ్యం వేసి బాగా వుండికించాలి.ఇందులో కాస్త పటిక బెల్లం వేసి కరిగే వరకు కలివుకోవాలి.చల్లారిన తరువాత కొంచెం చిక్కబడుతుంది ఇలా రెడీ చేసిన సగ్గుబియ్యం జావని తీసుకోవడం వల్ల చాలా మంచిది.రెండవది సబ్జాలతో చేసిన జ్యూస్.ఒక హాఫ్ కప్ సబ్జాలని ఇరవై నిముషాలు బాగా నానబెట్టాలి. తర్వాత రెండు గ్లాస్ ల వాటర్ తీసుకొని అందులో నాలుగు స్పూన్ లా పటిక బెల్లం పొడి వేసి రెండు నిమ్మకాయల రాసాన్ని కలపాలి.ఇప్పుడు ముందుగా నానబెట్టుకున్న సబ్జాలని వేసి బాగా కలిపి కొంచం సాల్ట్ వేసి రెండు పూటలా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒంట్లో వేడి వెంటనే తగ్గుతుంది.మూడవది ఒక కప్ పెరుగులో రెండు చెంచాల చెక్కెర వేసి కరిగే వరకు బాగా కలపాలి.ఇప్పుడు ఇందులో ఒక గ్లాస్ వాటర్ ఒక కాయ నిమ్మరసం కలిపి తీసుకోవాలి.దీని వల్ల ఎండ వల్ల వచ్చే వడదెబ్బని తట్టుకోవచ్చు. నాలుగవది బార్లీ గింజలతో చేసిన జావా.ముందుగా బార్లీ గింజలని లైట్ గా వేవి పొడిచేసుకోవాలి.ఇప్పుడు హాఫ్ కప్పు పొడిని తీసుకుని అందులో ఒక కప్ వాటర్ పోసి బాగా కలపాలి.తర్వాత ఒక పాన్లో నాలుగు కప్పులు వాటర్ పోసుకొని ఒక ముక్క అల్లం రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కాగాక, కలిపి పెట్టుకున్న బార్లీ పొడిని వేసుకువాలి.

## అల్లోవెరా జ్యూస్ తాగితే ఆ సమస్యలన్నీ మాయం



ప్రకృతిలో లభించే వివిధ పదార్థాల సహాయంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరు. దీనిలో చాలా ముఖ్యమైనది అలోవెరా. ఇది చర్మ సంరక్షణ మాత్రమే కాదు, అంతర్గత ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది.కలబంద రసం తాగడం వల్ల అనేక వ్యాధులు నయం అవుతాయి. కలబంద రసం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఇవే.. ఆధునిక జీవనశైలిలో, వివిధ ఆహారాల ద్వారా టాక్సిన్స్ పేరుకుపోతాయి. వాటిని ఎప్పటికప్పుడు డిటాక్సిఫై చేయాలి. కలబంద రసం మన ఆరోగ్యానికి సహాయపడుతుంది. మలబద్ధకం, అజీర్తి సమస్య నుంచి కాపాడుకునేందుకు అల్లోవెరా జ్యూస్ ఉపయోగపడుతుంది. ఇది శరీరాన్ని ఫిట్‌గా ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి అలోవెరా అద్భుతంగా పనిచేస్తుంది. దీన్ని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీ రోగనిరోధక వ్యవస్థ బాగా బలపడుతుంది. రక్తహీనత చాలా మంది ఇటీవల రక్తహీనత సమస్యను ఎదుర్కొన్నారు. కలబంద రసాన్ని రోజూ తాగడం వల్ల శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. రక్తహీనత సమస్య తొలగిపోతుంది. అలోవెరా జ్యూస్‌ని రోజూ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొడి చర్మానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పొడి చర్మం సమస్య నుంచి ఉపశమనం పొందుతారు.

## టీ తాగేటప్పుడు అదనంగా చక్కెర వేసుకుంటున్నారా?




టీ అంటే ఇష్టపడని వారు ఉండరు. చాలా మంది ఉదయం కాగానే ఎంతో ఇష్టంగా టీ తాగుతారు. అయితే టీ ఆరోగ్యానికి మంచిదే కానీ అతిగా తాగకూడదంటారు వైద్యులు.మరీ ముఖ్యంగా టీలో అధిక చక్కెర అస్సలే వేసుకోకూడదంట. కొంత మంది టీలో అధికంగా చక్కెర వేసుకుంటారు. కొన్ని సందర్భాల్లో అదనంగా చక్కెర వేసుకొని టీలో కలుపుకుంటూ తాగుతారు. అయితే ఈ అలవాటు చాలా డేంజర్ అంటున్నారు నిపుణులు. లిక్విడ్ డ్రిక్స్‌లో అధికంగా చక్కెర తీసుకోవడం వలన కొలెస్ట్రా నుంచి రక్త పోటు స్థాయిలను పెంచుతుందంట. అంతే కాకుండా ఇది గుండె ఆరోగ్యానికి చాలా హానికరం అని చెబుతున్నారు. షుగర్ అధికంగా తీసుకోవడం వలన మధుమేహం, బరువు పెరగడం, ఊబకాయం సమస్యలు ఎదురవుతాయి.వృద్ధులకు అల్జీమర్స్ వచ్చే ప్రమాదం ఉంది. అల్జీమర్స్‌తో పోరాడే ఎంజైమ్‌లకు చక్కెర హానికరం అని తాజా అధ్యయనంలో తేలింది. ఫలితంగా, ఎక్కువ చక్కెర తినడం వల్ల ఆ ఎంజైమ్‌ను నాశనం చేస్తుంది. అల్జీమర్స్ ప్రమాదాన్ని పెంచుతుంది.

అంతే కాకుండా అధిక షుగర్ అనేది పిల్లల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. అందువలన జ్యూస్, టీ, పాలు లాంటి లిక్విడ్ డ్రింక్స్ తాగిటప్పుడు వాటిలో షుగర్ అనేది అస్సలే వేసుకోకూడదంట.

## ఈ టాబ్లెట్స్ వేసుకుంటున్నారా? జాగ్రత్త..

నేరుగా మెడికల్ కి వెళ్లి అబార్షన్ పిల్స్ తెచ్చుకొని మరీ అబార్షన్ చేసుకుంటున్నారు కొందరు. ఇలాంటి వాటి వల్ల ఆరోగ్యసమస్యలు ఎక్కువ వస్తాయి అంటున్నారు నిపుణులు.అయితే కొన్ని దేశాల్లో దీన్ని నేరంగా పరిగణించారు. అయితే నేరుగా కొనుగోలు చేసిన టాబ్లెట్ల నాణ్యత, వాటి సామర్థ్యం వంటివి సరిగ్గా ఉండకపోవచ్చు. దీని వల్ల మహిళలకు గర్భస్రావం వంటి సమస్యలు వస్తాయి. ఇష్టానుసారంగా ఈ మాత్రలు వాడడం వల్ల వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా వారికి తెలియకపోవచ్చు. ఈ మాత్రల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలియక వైద్య చికిత్సను తీసుకోవాలి అనుకోరు. దీని వల్ల మరింత ప్రమాదం సంభవిస్తుంది. మీరు కాకుండా వైద్యుడు అబార్షన్ చేస్తే.. పిండంలోని అన్ని భాగాలను తొలగించి ఎలాంటి హానీ కలగకుండా చూస్తాడు. కానీ ఫార్మసీల నుంచి నేరుగా మాత్రలు తెచ్చుకోవడం వల్ల ఇలాంటివి జరగడం లేదు. అయితే పిండం కణజాలం గర్భాశయం లోపలికి జోడించి ఉంటుంది. దీని వల్ల రక్తస్రావం, సంక్రమణకు కారణం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చాలా దేశాల్లో అబార్షన్ చేసుకోవడం చట్టవిరుద్ధం. అనుమతించిన దేశాలలో కూడా మందులను నేరుగా కొనడం చట్టవిరుద్ధం. లైసెన్స్ పొందిన ప్రసూతి వైద్యుడి నుంచి అబార్షన్ చికిత్స సురక్షితమైనది అని గుర్తు పెట్టుకోండి. అంతేకాదు మహిళలకు మానసిక కౌన్సిలింగ్ కూడా అందుతుంది. అయితే మీరు కొనుక్కొని వేసుకునే మాత్రలు సులభమైన పరిష్కారం ఇచ్చినా.. వాటితో వచ్చే భద్రతా లోపాల గురించి జాగ్రత్త పడాల్సిందే. అందుకే వైద్యుల చికిత్స అవసరం. అబార్షన్ చేసుకోవడమే చట్టవిరుద్ధం.



అలాంటిది ప్రాణాలను పనంగా పెట్టి ఇంట్లోనే మాత్రల ద్వారా అబార్షన్ చేసుకోవడం మంచిది కాదు. కాబట్టి ముందుగా మీ సమస్య తెలుసుకొని డాక్టర్ ను సంప్రదించండి. లేదంటే మీరు అనారోగ్యపాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి అని తెలుసుకోండి.

## గ్రీన్ బీన్స్ తింటే.. శరీరానికి కలిగే లాభాలు

గ్రీన్ బీన్స్.. గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీటిని మనలో చాలా మంది ఇష్టంగా తింటారు. వీటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో ఉండే విటమిన్లు ఎ, సి, కె, ఫోలిక్ యాసిడ్, మాంగనీస్, పొటాషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఈ పోషకాలు మన ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి . వివిధ శారీరక విధుల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. గ్రీన్ బీన్స్ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అదేంటో ఇక్కడ చూద్దాం.. 1. గ్రీన్ బీన్స్ లో ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రల్ చేయడానికి సహాయపడతాయి. అంతే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడి , వాపును తగ్గిస్తుంది. 2. గ్రీన్ బీన్స్ లో పీచు, పొటాషియం, ఫోలిక్ యాసిడ్ అధిక రక్తపోటును నియంత్రించి, కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును పెంచుతుంది. అందువలన, ఇది గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. 3. గ్రీన్ బీన్స్ లో విటమిన్ కె, మాంగనీస్ వంటి




పోషకాలు ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి ఇవి చాలా అవసరం. ఈ పోషకాలు ఖనిజీకరణ ఎముక సాంద్రతకు దోహదం చేస్తాయి. క్రమం తప్పకుండా బీన్స్‌ను ఆహారంలో చేర్చుకోవడం వల్ల బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. 4. బీన్స్‌లోని ఫైబర్ గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహం, లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు పచ్చి బఠానీలను ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

## ఊబకాయంతో బాధపడుతున్నారా..? అయితే..



ప్రపంచవ్యాప్తంగా ప్రజలను వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది ఊబకాయం. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిని ఈ సమస్య వేధిస్తుంది. ఊబకాయం విషయంలో జాగ్రత్త వహించని పక్షంలో తీవ్ర అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది.ఊబకాయం వలన అనేక వ్యాధులు, హెల్త్ పరమైన సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా ఈ ఊబకాయం వలన గుండె సమస్యలతో పాటు అధిక రక్తపోటు, కాలేయ వ్యాధి, స్లీప్ అప్నియా, కొన్ని రకాల క్యాన్సర్లు మరియు కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరగడం వంటి సమస్యలు వస్తుంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అధిక స్థాయిలో పోషకాలు తీసుకోవడాన్ని (అధిక పోషణ) సైతం పోషకాహార లోపమనే అంటారు. దీని వల్ల ఊబకాయం, మధుమేహం వంటి రోగాల బారిన పడుతుంటారు. చిన్నారులు వయసు తగిన ఎత్తు, బరువు లేకపోవడంతో పాటు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కన్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇక నిద్రపట్టకపోవడం, గురక సమస్య, సాధారణం కంటే చెమటలు ఎక్కువగా పట్టడం, నడుము చుట్టూ కొవ్వు పట్టడం వంటి వాటిని పెద్ద వారిలో ఊబకాయం లక్షణాలుగా వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా తీవ్ర అలసట, వెన్ను నొప్పి, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కూడా ఊబకాయం ఉన్న వారిలో కన్పిస్తాయట. ఈ క్రమంలో ఊబకాయం రాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

## విపరీతమైన ఆకలి వేస్తుందా?



కొంతమందికి సాధారణం కంటే ఎక్కువ ఆకలి వేస్తుంటుంది. ఆకలిగా అనిపించడం అనేది శరీర సహజ ప్రక్రియ. కానీ మీరు ఎక్కువగా తినాలని భావిస్తే అది ఆందోళన కలిగించే విషయం అని అంటున్నారు నిపుణులు. నేటికీ భారతదేశంలో ఆహారపు అలవాట్లకు సంబంధించి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. వీటిలో ఒకటి బాగా ఆకలి వేస్తే ఆరోగ్యంగా ఉంటారు అనేది. ఎందుకంటే శరీరం ఆహారాన్ని డిమాండ్ చేస్తుంటే మీరు బాగానే ఉన్నారు అనుకుంటున్నారు. ఇలా ఆలోచించడం సరి కాదంటున్నారు నిపుణులు. విపరీతమైన ఆకలి వెనుక శరీరంలో కొన్ని సమస్యలు ఉండవచ్చని ఇలా నిరంతరం జరుగుతుంటే కడుపు, కాలేయం, మూత్రపిండాలు లేదా ఇతర అవయవాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని చెబుతారు వైద్యనిపుణులు. సాధారణంగా భోజనం చేసిన తర్వాత కూడా మీ కడుపు ఖాళీగా ఉన్నట్లు అనిపిస్తున్నా, ఎంత తిన్నా కడుపు నిండనట్టు ఉన్నా మళ్ళీ ఆహారం తింటూ ఉంటాం. అధిక ఆకలి కారణంగా ప్రజలు అధిక కేలరీలను తీసుకుంటారు. ఇది బరువు పెరుగుదలకు దారితీస్తుంది. వీటిలో ఒకటి బాగా ఆకలి వేస్తే ఆరోగ్యంగా ఉంటారు అనేది. ఎందుకంటే శరీరం ఆహారాన్ని డిమాండ్ చేస్తుంటే మీరు బాగానే ఉన్నారు అనుకుంటున్నారు. ఇలా ఆలోచించడం సరి కాదంటున్నారు నిపుణులు. విపరీతమైన ఆకలి వెనుక శరీరంలో కొన్ని సమస్యలు ఉండవచ్చని ఇలా నిరంతరం జరుగుతుంటే కడుపు, కాలేయం, మూత్రపిండాలు లేదా ఇతర అవయవాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని చెబుతారు వైద్యనిపుణులు.అధిక ఆకలి మధుమేహం ముఖ్యమైన లక్షణం అని డైటీషియన్లు చెబుతున్నారు. ఇలా ఎవరికైనా జరిగితే వారు ముందుగా షుగర్ పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అలాగే హార్మోన్ల అసమతుల్యత, హైపర్ థైరాయిడిజం, మానసిక స్థితి, పోషకాహార లోపంతో కూడా దీనికి కారణం కావచ్చని చెబుతున్నారు. ఒక్కోసారి ఒత్తిడి కారణంగా అతిగా తింటూ ఉంటారు. ఒక వ్యక్తి తగినంత మొత్తంలో ఫైబర్, ప్రోటీన్ లేదా ఇతర పోషకాలను తీసుకోకపోతే అది వారి ఆరోగ్యానికి హానికరం అని నిపుణులు చెబుతున్నారు. దీని కారణంగా అధిక ఆకలి సమస్య కూడా ఉండవచ్చు. మనిషికి తగినంత నిద్ర లేకపోతే వారు అధిక ఆకలి వంటి సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుందని చెబుతున్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలని డైటీషియన్లు చెబుతున్నారు.

# తెలుగు లో జాన్వీ మూడో సినిమా అదేనా.?



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్

ఇప్పటికే బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అక్కడ గత కొంత కాలంగా సినిమాలు చేస్తున్న జాన్వీ కి సక్సెస్ లు ఆశించిన స్థాయిలో సక్సెస్ లు దక్కలేదు. ఇప్పటి వరకు జాన్వీ కి కమర్షియల్ బ్రేక్ దక్కలేదని చెప్పాలి.

జాన్వీ కపూర్ మొదటి కమర్షియల్ హిట్ ను ఎన్టీఆర్ తో నటిస్తున్న 'దేవర' తో దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమాలో జాన్వీ కపూర్ నటిస్తూ టాలీవుడ్ కి ఎంట్రీ ఇవ్వబోతుంది.

జాన్వీ కపూర్ ఇటీవలే రామ్ చరణ్ కి జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో నటించబోతున్నట్లుగా అధికారిక ప్రకటన వచ్చింది. ఈ రెండు సినిమాలు కాకుండా మరో తెలుగు సినిమాలో కూడా జాన్వీ కపూర్ కనిపించబోతుందట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో రూపొందుతున్న పుష్ప 2 లో జాన్వీ కపూర్ తో ఐటం సాంగ్ ను చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. మైత్రి మూవీ మేకర్స్ వారు సాలిడ్ అమౌంట్ ను జాన్వీకి ఆఫర్ చేశారని, ఆమె ఓకే చెప్పే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఫ్యామిలీతో కలిసి ఆలయాన్ని

## సందర్శించిన రకుల్ ప్రీత్..!



టాలీవుడ్ హీరోయిన రకుల్ ప్రీత్ సింగ్ ఇటీవలే వివాహాబంధంలోకి అడుగుపెట్టింది. నటుడు, నిర్మాత అయిన తన ప్రియుడు జాకీ భగ్నానీతో ఏడడుగులు వేసింది. గోవాలో జరిగిన వీరి పెళ్లికి పలువురు సినీ తారలు కూడా హాజరయ్యారు.ఫిబ్రవరి 21 వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆనంద్ కరాజ్ అనే పంజాబీ సాంప్రదాయ పద్ధతిలో వీరి పెళ్లిబంధంతో ఒక్కటయ్యారు. వరుడి సాంప్రదాయం ప్రకారం సింధి పద్ధతిలోనూ ముచ్చటగా పెళ్లి చేసుకున్నారు.

అయితే పెళ్లి తర్వాత రకుల్, భగ్నానీ జంట బిజీగా మారిపోయింది. తన భర్తతో కలిసి ఆధ్యాత్మిక బాట పట్టింది. కుటుంబసభ్యులతో పాటు దేవుళ్ల ఆశీర్వాదాలు తీసుకుంటోంది. తాజాగా అస్సాం గువహటిలోని కామాఖ్య దేవి అమ్మవారిని రకుల్ దర్శించుకున్నారు. కొత్త జీవితం ప్రారంభించిన నూతన దంపతులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.




# మరో కొత్త కాన్సెప్ట్‌తో సుహాస్..

## 'ప్రసన్న వదనం' టీజర్ రిలీజ్.. ఫేస్ బ్లైండ్‌నెస్ జబ్బుతో..

కలర్ ఫొటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజి బ్యాండు.. లాంటి కొత్త కొత్త కాన్సెప్ట్స్ తో వస్తూ వరుస హిట్స్ కొడుతున్నాడు సుహాస్.షార్ట్ ఫిలిమ్స్ నుంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఎదిగి ఇప్పుడు హీరోగా వరుస సినిమాలు చేస్తూ సక్సెస్ లతో దూసుకుపోతున్నాడు. ఇటీవల అంబాజీపేట మ్యారేజి బ్యాండ్ తో హిట్ కొట్టిన సుహాస్ ఇప్పుడు ప్రసన్న వదనం సినిమాతో రాబోతున్నాడు.

సుహాస్ హీరోగా పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ హీరోయిన్స్ గా.. వైవా హర్ష, నితిన్ ప్రసన్న, సాయి శ్వేతా.. పలువురు ముఖ్య పాత్రల్లో కొత్త దర్శకుడు అర్జున్ దర్శకత్వంలో లిటిల్ థాట్స్ సినిమాస్ బ్యానర్ పై మణికంఠ, ప్రసాద్ రెడ్డి నిర్మాతలుగా ఈ ప్రసన్న వదనం సినిమా తెరకెక్కుతుంది. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు.

ప్రసన్న వదనం టీజర్ ఆద్యంతం ఆసక్తిగా ఉంది. టీజర్ చూస్తుంటే సినిమా క్రైం థ్రిల్లర్ అని తెలుస్తోంది. ఈ సినిమాలో సుహాస్ కి ఎవరి ఫేస్ సరిగ్గా కనపడని, గుర్తుపట్టలేని.. ఫేస్ బ్లైండ్ నెస్ అనే జబ్బు ఉన్నట్టు చూపించారు. దీంతో ఈసారి కూడా సుహాస్ కొత్త కాన్సెప్ట్ తో రాబోతున్నట్టు అర్ధమవుతుంది. సుహాస్ ప్రసన్న వదనంతో కూడా హిట్ కొట్టి సక్సెస్ ని ఇలానే కంటిన్యూ చేస్తాడేమో చూడాలి.

# కన్నప్ప' ఫస్ట్ లుక్ అప్‌డేట్ వచ్చేసింది!




టాలీవుడ్ హీరో మంచు విష్ణు తెరకెక్కిస్తున్న లేటెస్ట్ సినిమా 'కన్నప్ప'. దూర్జటి విరచిత 'శ్రీకాళహస్తీశ్వర మహత్యం' కావ్యం ఆధారంగా మంచు విష్ణు నిర్మిస్తున్న ఈ సినిమాకి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు.ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ న్యూజిలాండ్‌లో జరుగుతుంది. ఈ సినిమా భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. ఇక ఈ నుంచి విడుదలైన మోషన్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ అందుకుంది.తాజాగా మేకర్స్ 'కన్నప్ప' ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మహా శివరాత్రి కానుకగా.. మార్చి 8 మధ్యాహ్నం 2.55 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు మేకర్స్. ఇక ఈ సినిమాలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ శివుడి పాత్రలో నటించబోతున్నారు. ఈ విషయాన్ని మంచు విష్ణు అధికారికంగా వెల్లడించారు. కన్నప్ప మొదట నాస్తికుడు అన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత శివుడికి భక్తుడిగా మారతాడు. ఇక అతడు శివుడి భక్తుడిగా ఎలా మారాడు? అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా 2025 లో ప్రేక్షకుల ముందు రానుంది.

# ఏపీ ఫైబర్ నెట్‌లో ఆర్జీవీ 'వ్యూహం',

## వెబ్ సిరీస్‌గా 'శపథం', స్ట్రీమింగ్ ఎప్పుడంటే..?



ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన తాజా చిత్రం 'వ్యూహం'. గత శనివారం(మార్చి 2) థియేటర్స్‌లో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది.

వైఎస్సార్ మరణం తర్వాత ఎపీ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలను తనదైన శైలీలో తెరపై చూపించాడు ఆర్జీవీ. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం కాకుండా చేసేందుకు అటు కాంగ్రెస్, ఇటు టీడీపీ చేసిన కుట్రలను.. వాటన్నింటిని ఎదుర్కొని వైఎస్ జగన్ ప్రజా నాయకుడిగా ఎలా ఎదిగాడనేది ఈ చిత్రం ద్వారా చూపించాడు.

దీనికి సీక్వెల్‌గా 'శపథం'అనే చిత్రం ఈ నెల 8న విడుదల కావాల్సింది. రిలీజ్ డేట్‌ని కూడా గత వారమే ప్రకటించారు. కానీ ఇప్పుడీ చిత్రం థియేటర్స్‌లో రిలీజ్ కావడం లేదు. వెబ్ సిరీస్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. శపథం ఆరంభం, శపథం అంతం అంటు రెండు భాగాలుగా ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ విషయాన్ని ఓ ప్రకటన ద్వారా తెలియజేశాడు ఆర్జీవీ.వ్యూహం , శపథం ల వెనుక మా అసలు వ్యూహం సైడ్ బై సైడ్ వెబ్ సిరీస్ కూడా తియ్యటం. కానీ కొన్ని కారణాల వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో సెన్సార్ బోర్డు అనుమతించిన వెర్షన్ మాత్రమే థియేటర్లలో రిలీజ్ చెయ్యడం జరిగింది. కానీ ఇప్పుడు మేము ఫస్ట్ నుంచి రెడీ చేసి పెట్టుకున్న వెబ్ సిరీస్ శపథం ఆరంభం చాప్టర్ 1 ని ఈ రోజు(మార్చి 7) సాయంత్రం 8 గంటలకు, శపథం అంతం చాప్టర్ 2ని రేపు(మార్చి 8) సాయంత్రం 8 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఫైబర్ నెట్ ద్వారా పే పర్ వ్యూలో చూసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాం.

ఆ తర్వాత అంచెలంచెలుగా అన్ని ఓటీటీ ప్లాట్ ఫాంలలో రిలీజ్ అవుతాయి. శపథం ఆరంభం చాప్టర్ 1 , శపథం అంతం చాప్టర్ 2 రెండు కూడా తీసిన ఉద్దేశ్యం ఏమీ దాచకుండా పచ్చి నిజాలు చూపిస్తాం' అని ఆర్జీవీ అన్నారు. ఫస్ట్ డే ఫస్ట్ షో ప్రోగ్రాంలో భాగంగా ఏపీ ఫైబర్ నెట్ లో వ్యూహం సినిమా రిలీజ్ చేస్తున్నామని ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి వెల్లడించారు. అలాగే ఓటీటీ ద్వారా శపథం వెబ్ సిరీస్‌ని విడుదల చేస్తున్నామని అన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలు..

## 'బెస్ట్ డిజైనర్ డ్రెస్' విజేతగా సినిశెట్టి

మిస్ వరల్డ్ 2024 విన్నర్ ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది. 28 ఏళ్ల తర్వాత భారత్ వేదికగా జరుగుతున్న పోటీలు కావడం, మిస్ ఇండియా వరల్డ్- 2022 విజేత సినిశెట్టి పాల్గొనడంతో అంతటా ఆసక్తి నెలకొంది.మరి, ఇప్పటి వరకు సినిశెట్టి ప్రయాణం ఎలా సాగింది? ఏయే అవార్డులు దక్కించుకుంది?ఆమె నేపథ్యమేంటి? తెలుసుకుందాం ఈ అందాల భామ తల్లిదండ్రులది మంగళూరు (కర్ణాటక). ముంబయిలో పుట్టి, పెరిగింది. అకౌంటింగ్%డ% ఫైనాన్స్‌లో డిగ్రీ పట్టా పొందిన శెట్టి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా కార్పొరేట్ సంస్థల్లో పనిచేసింది. ఆమెకు డ్యాన్స్ అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. నాలుగేళ్ల వయసులోనే భరతనాట్యంలో శిక్షణ తీసుకుంది. 14 ఏళ్ల వయసులో నృత్యకారిణిగా అరంగేట్రం చేసింది. ఫ్యాషన్‌పై మక్కువ ఉన్న శెట్టి.. మాజీ మిస్ వరల్డ్, నటి ప్రియాంక చోప్రా స్ఫూర్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ క్రమంలో ఎయిర్‌టెల్‌కు సంబంధించి ఓ వాణిజ్య ప్రకటనలో నటించి, ఆకట్టుకుంది.

2022లో తొలిసారిగా 'మిస్ ఇండియా కర్ణాటక' పోటీలో పాల్గొని టైటిల్‌ని సొంతం చేసుకుంది.అదే ఏడాదిలో మిస్ ఇండియా పోటీల్లోనూ పాల్గొని కిరీటం దక్కించుకుంది. 'టైమ్స్ మిస్ బాడీ బ్యూటిఫుల్', 'ఎన్ఐఎఫ్‌డీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్) మిస్ టాలెంట్' సబ్- టైటిల్ అవార్డులూ అందుకుంది.మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు రెండేళ్ల నుంచి సన్నద్ధమైన శెట్టి, ఇప్పటికే నిర్వహించిన పలు ఛాలెంజ్ ఈవెంట్లలో సత్తా చాటింది.

'హెడ్ టు హెడ్ ఛాలెంజ్'లో టాప్ 25, 'టాలెంట్ ఛాలెంజ్'లో టాప్ 14, 'టాప్ మోడల్ ఛాలెంజ్'లో టాప్ 20లో నిలిచి, 'మిస్ వరల్డ్ 2024' టైటిల్ లక్ష్యంగా దూసుకెళ్తోంది.



'టాలెంట్ ఛాలెంజ్'లో భాగంగా.. మాజీ మిస్ వరల్డ్, నటి ఐశ్వర్యా రాయ్ హిట్ సాంగ్స్‌కు శెట్టి డ్యాన్స్ చేసి విశేషంగా అలరించింది. ధోతిశారీలో ప్రదర్శన ఇచ్చి, ప్రత్యేకంగా నిలిచింది.

# ఏఐపై కీలక వివరాలు వెల్లడించిన తాజా అధ్యయనం

ఏఐ రాకతో మనుషులు చేసే పలు ఉద్యోగాలను ఏఐ రీప్లేస్ చేస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్న నేపధ్యంలో తాజా అధ్యయనం భిన్న కోణాన్ని ఆవిష్కరించింది. ఏఐ రాకతో మనుషులు చేసే పలు ఉద్యోగాలను ఏఐ రీప్లేస్ చేస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్న నేపధ్యంలో తాజా అధ్యయనం భిన్న కోణాన్ని ఆవిష్కరించింది. ఏఐ ఉద్యోగులకు సహకరిస్తుందని, వాస్తవంగా ఇది వారి పని అనుభవాన్ని, సామర్ధ్యాన్ని పెంచుతుందని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. వర్క్ రిలేషన్‌షిప్ ఇండెక్స్ పేరిట హెచ్‌పీ చేపట్టిన ఈ తాజా అధ్యయనం ఆసక్తికర వివరాలు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతూ విపరీతమైన ఒత్తిడికి గురువుతండగా ఏఐ వారి పనిభారాన్ని తగ్గిస్తూ, వారి టాస్క్‌లను సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఒత్తిడిని నివారిస్తుందని ఈ అధ్యయనంలో వెల్లడైంది. పనిలో ఒత్తిళ్లను ఎదుర్కొనే క్రమంలో ఏఐ తమకు సాయపడుతుందని ఉద్యోగులు నమ్ముతున్నారు. భారత్ సహా 12 దేశాల్లోని 15,600 మందిని ఈ సర్వే పలుకరించి కీలక వివరాలు రాబట్టింది. ఎదుగుతున్న ఆర్ధిక వ్యవస్ధల్లో ఏఐ తమ ఉద్యోగాన్ని సరళతరం చేస్తుందని 76 శాతం మంది ప్రొఫెషనల్స్ వెల్లడించారు. ఏఐ పట్ల చాలా ఆసక్తికరంగా ఉన్నామని 75 శాతం మంది వెల్లడించగా, పరిణితి చెందిన ఆర్ధిక వ్యవస్ధల్లో పనిచేసే ఉద్యోగులు 44 శాతం మంది ఈ తరహా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. ఉద్యోగుల సామర్ధ్యాలకు పదును పెట్టి, ఉత్పాదక వాతావరణాన్ని సానుకూలంగా మార్చే సత్తా ఏఐకి ఉందని అధ్యయనం వెల్లడించింది. ఏఐ సామర్ధ్యాన్ని ఉద్యోగులకు వివరించేలా బిజినెస్ లీడర్స్ చొరవచూపాలని, ఏఐని అర్ధం చేసుకుని ఆమోదించాలని హెచ్‌పీ వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్, హెచ్‌పీ ఇంక్ ప్రెసిడెంట్ డేవ్ షల్ పేర్కొన్నారు.



# మస్క్.. విలీనం చేసుకోవాలనుకున్నారు




**వాషింగ్టన్ :** టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ ఇటీవల దాఖలు చేసిన దావాపై కృత్రిమమేధ అంకుర సంస్థ ఓపెన్‌ఏఐ అధికారికంగా స్పందించింది. 'మస్క్ మా సంస్థను టెస్లాలో విలీనం చేసుకోవాలనుకున్నారు. అలా కుదరని పక్షంలో, పూర్తి నియంత్రణ వహించాలనుకున్నార'ని ఓపెన్‌ఏఐ పేర్కొంది. ప్రజా సంక్షేమం కోసం, లాభాలను ఆశించకూడదనే భావనతో ఏర్పాటైన ఓపెన్‌ఏఐ కాస్తా.. మైక్రోసాఫ్ట్ కింద లాభాలకోసమే పనిచేసే సంస్థగా మారిందని..తన లక్ష్యం విషయంలో రాజీ పడిందని మస్క్ ఆరోపించగా, ఓపెన్‌ఏఐ ఇలా స్పందించింది. 'మా ప్రణాళికల్లో భాగంగా లాభాపేక్ష నిర్మాణంపై చర్చలు జరిగాయి. ఎలాన్ మస్క్ మాత్రం టెస్లాలో ఓపెన్‌ఏఐని విలీనం చేయాలన్నారు. లేదంటే పూర్తి నియంత్రణను ఆయన చేతికి ఇవ్వమన్నారు. ఓపెన్‌ఏఐని ఎలాన్ వీడిన తర్వాత గూగుల్/ డీప్‌మైండ్‌కు ఒక పోటీదారు ఉండాలని.. మాకు మద్దతునిస్తానని అన్నారు. 2017లో మేం, ఎలాన్ కలిసి ఒక లాభాపేక్ష సంస్థనే ఏర్పాటు చేయాలనుకున్నాం. బోర్డు నియంత్రణ, సీఈఓ పదవి తనకు కావాలన్నారు. అయితే మస్క్‌తో కొన్ని నిబంధనలకు ఓపెన్‌ఏఐ అంగీకరించలేద'ంటూ ఓపెన్‌ఏఐ వివరించింది. తమ సంస్థలో మస్క్ 45 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 375 కోట్ల) కంటే తక్కువ పెట్టుబడులు పెట్టగా.. ఇతరుల నుంచి 90 మిలియన్ డాలర్ల (రూ. 750 కోట్ల)కు పైగా సమీకరించినట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది.

# 74వేల మార్క్‌కు సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన రికార్డ్‌లను చేరాయి. కొనుగోళ్ల మద్దతుతో తొలిసారి సెన్సెక్స్ 74వేల పాయింట్ల మార్క్‌ను దాటగా.. నిఫ్టీ 22,400 దాటేసింది. కిత్రం సెషన్‌తో పోలిస్తే బుధవారం ఉదయం స్టాక్ మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత కొద్ది సేపటికి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్, విత్త షేర్లు పరుగులు పెట్టాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 409 పాయింట్లు లేదా 0.55 శాతం పెరిగి 74,086 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 118 పాయింట్లు లేదా 0.53 శాతం లాభపడి 22,474కు చేరింది. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలతో ఉదయం 73,587.70 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 73,321 కనిష్ఠానికి చేరింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 74,151, నిఫ్టీ 22,497 గరిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యాయి. కొటాక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇండుస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, టైటన్, టిసిఎస్ తదితర స్టాక్స్ 2.45 శాతం మేర పెరిగి మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.65 శాతం, 1.9 శాతం నష్టాలను చవి చూశాయి. నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ 0.8 శాతం, ఫైనాన్సియల్ సూచీ 0.6 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు లోహ సూచీ 2.5 శాతం, రియాల్టీ 1.3 శాతం చొప్పున నష్టపోయాయి.

# 'జెమిని' వివాదాలు.. ఊడుతున్న ఉద్యోగాలు..





గూగుల్ సంస్థ అత్యాధునిక కృత్రిమమేధ (ఏఐ) టూల్ 'జెమిని'ని గతేడాది డిసెంబరులో పరిచయం చేసింది. అయితే ఇటీవల ఈ టూల్ వెల్లడించిన సమాధానాలు వివాదాస్పదమవుతున్న విషయం తెలిసిందే. దీనిపై కంపెనీ సీఈవో సుందర్ పిచాయ్ కూడా స్పందించారు. కొన్ని ప్రశ్నలకు జెమిని ఇచ్చిన ఫలితాలు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయనే స్వయంగా తెలిపారు. ఈ 'జెమిని' ఎఫెక్ట్ ఇంటర్నెట్ వాడుతున్న వారిపై ఎక్కువ ప్రభావం ఉండకపోయినా దాన్ని తయారుచేసిన గూగుల్‌పై అయితే కచ్చితంగా ఉంటుంది. బూమింగ్ టెక్నాలజీకి సంబంధించి సరైన సమీక్ష లేకుండా ఇతరులతో పోటీపడాలనే తొందరలో ఉద్యోగులు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిస్తుంది. గూగుల్ 'జెమిని' వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గూగుల్ తన ట్రస్ట్, సేఫ్టీ టీమ్ నుంచి కొంతమంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదించింది.

# భారతదేశంలో ఐదుగురు అత్యంత సంపన్న మహిళలు ఎవరో తెలుసా..?



భారత దేశంలో ప్రపంచంలోని ధనవంతుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా పురుషుల పేర్లను ఎక్కువగా ప్రస్తావిస్తారు. అది బిల్ గేట్స్ లేదా మార్క్ జుకర్‌బర్గ్ లేదా ముఖేష్ అంబానీ కావచ్చు. అయితే భారతదేశంలో అత్యంత సంపన్న మహిళ ఎవరో తెలుసా? లేక దేశంలోని అత్యంత సంపన్న మహిళల్లో ఎవరి పేరు ఉందో తెలుసా? దేశంలోని 5 ధనవంతులైన మహిళల గురించి తెలుసుకుందాం. భారత దేశంలో ప్రపంచంలోని ధనవంతుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా పురుషుల పేర్లను ఎక్కువగా ప్రస్తావిస్తారు. అది బిల్ గేట్స్ లేదా మార్క్ జుకర్‌బర్గ్ లేదా ముఖేష్ అంబానీ కావచ్చు. అయితే భారతదేశంలో అత్యంత సంపన్న మహిళ ఎవరో తెలుసా? లేక దేశంలోని అత్యంత సంపన్న మహిళల్లో ఎవరి పేరు ఉందో తెలుసా? దేశంలోని 5 ధనవంతులైన మహిళల గురించి తెలుసుకుందాం. సావిత్రి జిందాల్: భారతదేశంలోని అత్యంత సంపన్న మహిళల జాబితాలో సావిత్రి జిందాల్ అగ్రస్థానంలో నిలిచారు. ఆమె భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళ. సావిత్రి జిందాల్ జిందాల్ గ్రూప్ ఛైర్మన్. ఆమె దేశంలోని అత్యంత సంపన్నుల జాబితాలో ఆరో స్థానంలో నిలిచింది. మహిళల జాబితాలో మొదటి స్థానంలో ఉంది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ల జాబితాలో జిందాల్ 94వ స్థానంలో ఉన్నారు. 73 ఏళ్ల సావిత్రి నికర విలువ 17 బిలియన్ డాలర్లు (రూ. 13,91,31,82,50,000). భర్త చనిపోవడంతో వ్యాపారం నిర్వహిస్తోంది. సావిత్రి జిందాల్ తర్వాత రోష్నీ నాడార్ మల్హోత్రా, రేఖా ఝున్‌జున్‌వాలా, ఫల్గుణి నాయర్, కిరణ్ మజుందార్ షాల పేర్లు దేశంలోని టాప్ బిలియనీర్ మహిళల జాబితాలో ఉన్నాయి. రోష్నీ నాడార్: దేశంలోని టాప్-5 సంపన్న మహిళల్లో రోష్నీ నాడార్ మల్హోత్రా కూడా ఉన్నారు. గతేడాది విడుదలైన ప్రముఖ సంపన్న మహిళల నివేదిక ప్రకారం రోష్నీ నాడార్ మొత్తం సంపద రూ. 84,330 కోట్లు.

# భారత్ నుంచి స్విస్‌కు ఆరు లక్షల పర్యాటకులు



గతేడాది భారత్ నుంచి స్విట్జర్లాండ్‌కు ఆరు లక్షల మంది పర్యాటకులు వచ్చారని స్విట్జార్లాండ్ టూరిజం ఈస్ట్ మార్కెట్స్ చీఫ్ మార్కెట్ ఆఫీసర్ సిమోన్ బాషాట్ తెలిపారు. హైదరాబాద్‌లో ఇండియా హెడ్ రితూ శర్మతో కలిసి సిమోన్ విలేకరులతో మాట్లాడుతూ.. భారతీయ పర్యాటకులకు ఏడాది పొడవునా పర్యాటక గమ్యస్థానంగా ఉందన్నారు. కరోనాకు ముందు 8 లక్షల మంది పర్యాటకులు వచ్చే వారని తెలిపారు. ఈ ఏడాది ఆ స్థాయికి చేరుకోగలమని సిమోన్ విశ్వాసం వ్యక్తం చేశారు. చలికాలంలో ఎక్కువ మంది తమ దేశానికి వస్తారని తెలిపారు. భారత్ నుంచి వచ్చే పర్యాటకుల్లో తెలుగు రాష్ట్రాల వారి వాటా 4.8 శాతంగా ఉందన్నారు. మహారాష్ట్ర, గోవా నుంచి అత్యధికంగా 29.4 శాతం మంది స్విస్‌కు వస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉందన్నారు. రోజుకు సగటున రూ. 30వేలు (310 సిహెచ్ఎఫ్) వ్యయం అవుతుందన్నారు. కరోనా తర్వాత భారత్ నుండి ఎక్కువ మంది వినూత్న అనుభవాలను కోరుకుంటున్న ప్రయాణికులను తాము చూస్తున్నామన్నారు. స్విస్‌లో ఒక ప్రయాణ పాస్‌తో 90కి పైగా నగరాలు, పట్టణాల్లో తిరగవచ్చన్నారు. స్విట్జర్లాండ్ టూరిజం తన ప్రచార రాయబారిగా నీరజ్ చోప్రాతో ఒప్పందం కుదుర్చుకుందని రితూ శర్మ తెలిపారు.

# ప్లీజ్ మమ్మల్ని ప్రోత్సహించండి – ఎన్‌పీసీఐకు చిన్న యూపీఐ యాప్‌ల వినతి




తాజాగా చిన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) యాప్‌లు భారతదేశంలో రిటైల్ చెల్లింపులు, సెటిల్‌మెంట్ సిస్టమ్‌లను నిర్వహించే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఫిర్యాదు చేసినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మార్కెట్‌లో గూగుల్ పే, ఫోన్‌పే వంటి యాప్స్‌తో పోటీ పడేందుకు మరిన్ని ప్రోత్సాహకాలను కోరుతున్నాయి. ఎన్‌పీసీఐ ద్వారా జరిగిన సమావేశంలో చిన్న యూపీఐ యాప్‌లు పరిమిత మార్కెటింగ్ బడ్జెట్‌ల కారణంగా క్యాష్‌బ్యాక్, రివార్డ్‌లను అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. భారతదేశంలో ఆన్‌లైన్ చెల్లింపుల విషయంలో యూపీఐ లావాదేవీలు అగ్రస్థానంలో ఉన్నాయి. మార్కెట్‌లో నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి 2016లో కేంద్రం ఎన్‌పీసీఐ సహకారంతో యూపీఐ సేవలను ప్రారంభించింది. ఈ సేవలను వినియోగించుకోవడానికి ఎలాంటి రుసుములు అవసరం లేకపోవడంతో ఈ సేవలు చాలా ప్రాచుర్యం పొందాయి.

# గోల్డ్ బాండ్లకు మస్తు గిరాకీ....




**ముంబై :** భారతీయులకు బంగారంపై ఎంత మోజుంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ధరలతో సంబంధం లేకుండా పసిడిపై హద్దుల్లేని మక్కువను ప్రదర్శిస్తారు. నగలు, నాణేలు ఇలా.. ఏ రూపంలో ఉన్నా పుత్తడి అంటే ప్రేమే. ఇప్పుడు గోల్డ్ బాండ్లపైనా అది కనిపిస్తున్నది. ఓవైపు రికార్డు స్థాయిలో రేట్లు పెరిగినా గత నెలలో గట్టిగానే కొనేశారు మరి. ఫిబ్రవరిలో రూ. 8,000 కోట్ల విలువైన పసిడి బాండ్లను దేశీయ ఇన్వెస్టర్లు కొన్నట్టు తేలింది. దేశంలో గోల్డ్ బాండ్లు హాట్ కేకులను తలపిస్తున్నాయి. సహజంగానే బంగారంపై ఇష్టాన్ని కనబర్చే భారతీయులు.. ట్రెండ్‌కు తగ్గట్టు రూటు మార్చేశారు. పెట్టుబడులపై పెరుగుతున్న అవగాహన నేపథ్యంలో అంతా ఇప్పుడు గోల్డ్ బాండ్లపై దృష్టి పెడుతున్నారు మరి. గత నెలలో అమ్ముడుపోయిన పసిడి బాండ్లే ఇందుకు నిదర్శనం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా వివరాల ప్రకారం ఫిబ్రవరిలో భారతీయులు 12.78 టన్నులకు సమానమైన సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ)ను కొన్నారు. వీటి విలువ రూ. 8,008.38 కోట్లు (966 మిలియన్ డాలర్లు). ఇప్పటిదాకా ఇదే అత్యంత గరిష్ఠమని ఆర్బీఐ ప్రకటించింది. సరిగ్గా 8 ఏండ్ల 2 నెలల క్రితం (2015 నవంబర్ 30) ఆర్బీఐ భారత్‌లో గోల్డ్ బాండ్లను పరిచయం చేసింది. అప్పట్నుంచి చూస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన విక్రయాల విలువే ఎక్కువ.

# టెలికాం సర్వీస్ ప్రొవైడర్లకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక సూచనలు



న్యూఢిల్లీ: దేశంలో టెలికాం రంగానికి సంబంధించి స్పెక్ట్రమ్ వేలం నిర్వహించనున్నారు. ఇందులో ప్రతి టెలికాం సంస్థ హాజరుకావాలని సూచించారు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్. అలాగే మార్చి 9న బెంగళూరు వేదికగా జరిగే రెండు ప్రత్యేక కార్యక్రమాలకు హాజరుకానున్నారు. బెంగళూరులోని నివెట్టి సిస్టమ్స్ క్యాంపస్?లో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. భారతదేశంలో తయారు చేసిన, అత్యంత వేగవంతమైన %ఖ్రా/వీూబా% రూటర్?ను ప్రారంభించనున్నారు. అలాగే సాయంత్రం 4 గంటలకు బెంగళూరులోని అప్లైడ్ మెటీరియల్స్ ఇండియా వాలిడేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. వీటితో పాటు వార్షిక స్పెక్ట్రమ్ వేలం నిర్వహించనున్నారు. ఇది భారతదేశంలోని టెలికమ్యూనికేషన్ సిస్టంలో తీసుకొచ్చిన ప్రతిష్ఠాత్మకమైన సంస్కరణగా అభివర్ణించారు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్. ప్రతి టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు కచ్చితంగా, పారదర్శకంగా స్పెక్ట్రమ్?ను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి ఏటా వీటిని రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

# వనదేవతల ఆశీస్సులతో గిరిజన వర్సిటీ ప్రారంభం: మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్: ఆదివాసీ వనదేవతలు సమ్మక్క, సారలమ్మల ఆశీస్సులతో గిరిజన యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్ ప్రారంభించినట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ములుగు మండలం, జాకారం గ్రామంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌ను శుక్రవారం పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపి మాలోత్ కవితతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన ప్రాంతంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ప్రారంభించడం చాలా సంతోషకరమని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో గిరిజనుల అక్షరాస్యత 49 శాతంగా ఉందని, గిరిజన మహిళలలో 39 శాతంగా ఉందని, వారిలో 100కు వంద శాతం అక్షరాస్యత శాతం పెంచడమే ముఖ్య ఉద్దేశంగా గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం సమ్మక్క, సాలరమ్మ సెంట్రల్ యూనివర్సిటీ కోసం 889.07 కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని తెలంగాణ ప్రాంతంలో ఉన్నత విద్య ప్రాముఖ్యత, నాణ్యతను మెరుగుపరచడానికి ఇదొక సువర్ణ అవకాశమని అన్నారు. 2024–25 విద్యా సంవత్సరం నుండి ప్రస్తుతం ఏర్పాటు చేసిన జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్లో బిఏ ఇంగ్లీష్, బిఏ సోషల్ స్టడీస్ రెండు కోర్సులతో తరగతులను ప్రారంభిస్తామని అన్నారు. స్థానిక యువత యూనివర్సిటీలో ప్రవేశం కోసం దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ యూనివర్సిటిలో 35 శాతం ప్రత్యేకంగా గిరిజన విద్యార్థుల కోసం సీట్లను కేటాయించామని తెలిపారు. త్వరలోనే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా యూనివర్సిటీకి భూమి పూజ చేయడానికి సన్నాహాలు చేయాలని, యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణ పనుల కోసం టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ యూనివర్సిటీలో గిరిజనుల ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు, సాంప్రదాయాలపై రీసెర్చ్ యూనిట్ ఉంటుందన్నారు. ఈ యూనివర్సిటీకి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీ మెంటర్‌గా వ్యవహరిస్తుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ..ములుగు ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, ఈ ప్రాంతం ముఖ్యంగా టూరిజం హబ్‌గా మాత్రమే ఉందని, యూనివర్సిటీ ఏర్పడుతూ టూరిజంతో పాటు ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా, అనేక టూరిజం ప్రాంతాలతో ఉందని దేశం నలుమూలల నుండి సందర్శకులు, పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంపై ఎక్కువ దృష్టి పెట్టి మరింత అభివృద్ధి చేయడం కోసం నిధులు మంజూరు చేయాలని తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అన్నారు. మహబూబాబాద్ ఎంపి కవిత మాట్లాడుతూ.. ఈ ప్రాంత ఆరాధ్య దైవాలుగా ఉన్న సమ్మక్క, సారలమ్మ వనదేవతల పేరు మీద యూనివర్సిటీని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని, యూనివర్సిటీ ఏర్పాటుతో స్థానిక గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటి డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ శర్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్, సిస్టం అనాలసిస్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25 నుంచి మోదీ ఎన్నికల శంఖారావం..
## 150 సభలు, లెక్కలేనన్ని రోడ్ షోలు



న్యూఢిల్లీ: నేషనల్ అయినా, ఇంటర్నేషనల్ అయినా టూర్లు మొదలుపెడితే నాకంటే ఎవరు బాగా తిరగలేరు అనంటున్నారు ప్రధాని మోదీ. వరుస మీటింగులతో మీకు అలసటొస్తుందేమో... నాకు ఊపొస్తుందంటున్నారు. మరేంటి 150 సభలు, లెక్కలేనన్ని రోడ్ షోలూ, వందల కొద్దీ స్పీచ్‌లతో మరోసారి పీటమెక్కేందుకు దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ని ఫిక్స్ చేశారు ప్రధాని మోదీ. మీటింగుల లెక్క ఎక్కువైనా పర్లేదు తక్కువ కాకుండా చూసుకుంటున్నారు. ఈనెల 25 నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు ప్రధాని మోదీ. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మీటింగులు నిర్వహించేలా ప్లాన్ చేశారు. రోజుకు రెండు మీటింగులు ఉండేలా చూసుకుంటున్నారు. రోడ్ షోలకు సైతం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశారు. దేశవ్యాప్తంగా 150 ప్రచార సభలు ఉండగా... కేవలం దక్షిణ భారతంలోనే 35 నుంచి 40 సభల్లో మోదీ ప్రసంగించనున్నారు. యూపీలో 15 కంటే ఎక్కువ సభల్లో పాల్గొంటారు. అస్సాంలో 2, మధ్యప్రదేశ్‌లో 3 సభల్లో పాల్గొని ప్రతిపక్షాల తీరును ఎండగట్టనున్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే... 5 ఏళ్ల విజన్ ఎలా ఉండబోతోందో ప్రజల కళ్ల ముందుంచనున్నారు మోదీ. ప్రతి ఒక్క మీటింగ్ సక్సెస్ అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్లేస్‌ని బట్టి, సిచ్యువేషన్‌ని బట్టి నేతలను వెంట తీసుకెళ్లనున్నారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు మ్యాగ్జిమమ్ ప్రధాని ప్రతీ మీటింగ్‌కు హాజరుకానున్నారు. ప్రసంగాలు సైతం షార్ట్ అండ్ స్వీట్‌గా ఉండేలా చూసుకుంటున్నారు. ప్రత్యర్థులపై పంచ్‌లు సైతం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా... హోలీ పండుగ తర్వాత మోదీ ఎన్నికల ప్రచార పండుగను షురూ చేయనున్నారు. గెలుపే లక్ష్యంగా దేశవ్యాప్తంగా పర్యటించనున్నారు. మరి షెడ్యూలే ఈ రేంజ్‌లో ఉంటే ఇక సభలు ఏ రేంజ్‌లో ఉంటాయో చూడాలి.

# ఆలయ ఆవరణలో డంప్ యార్డు ను ఎత్తివేయిస్తా : బండి సంజయ్



ఉమ్మడి కరీంనగర్: కరీంనగర్ బైపాస్ రోడ్డు సమీపంలోని రేణుకా ఎల్లమ్మ తల్లి గుడి సమీపంలోని డంప్ యార్డును ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కృషి చేస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. శివరాత్రి సందర్భంగా రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని బండి సంజయ్ కుమార్ సందర్శించారు. ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా డంప్ యార్డును తొలగించాలని కోరుతూ ఆలయ కమిటీ వారు వినతిపత్రం సమర్పించారు. ఆలయ ఆవరణలో డంప్‌యార్డు ఉండటంతో దుర్వాసన వెలువడుతోందని, ఆలయానికి వచ్చే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# నేను అలా అనలేదు : హరీశ్ రావు ఖండన



హైదరాబాద్ : ఉద్యోగులకు జీతాలు ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు దుష్ప్రచారం చేస్తుండటం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తనపై చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తన ప్రసంగాన్ని తప్పు అర్థం వచ్చేలా ప్రచురించిన సదరు మీడియా సంస్థకు రిజాయిండర్ పంపించి, వార్తను సరిచేయించడం జరిగిందని వెల్లడించారు. అయినా కొందరు కావాలని ఉద్యోగులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు బంధు డబ్బులు ఆపి ఎసి రూములో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించింది అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామనే ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పదే పదే నిలదీస్తూ వస్తున్నానని, అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగుల పక్షాన గొంతెత్తానని వెల్లడించారు. ఎల్లప్పుడూ ఉద్యోగుల హక్కుల కోసం అండగా నిలిచే తనపై కొందరు కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రభుత్వ ఉద్యోగులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించి నాలుగు కరువు భత్యాలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలని, పిఆర్‌సి గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. మరో వైపు హరీశ్‌రావు 800 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సిద్దిపేట్‌లోని బాబు జగజ్జీవన్ రామ్ భవన్‌లో శుక్రవారం జరిగింది. సిద్దిపేట అర్బన్, నంగు నూర్ మండలాలకు చెందిన 800 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందారు. శిక్షణ పూర్తయిన అనంతరం వారందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు హరీశ్ రావు అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావుకు లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హరీశ్ రావుకు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

## తెలంగాణలో బీజేపీ నయా స్కెచ్..
# ఇక దబిడి దిబిడేనా..?!

హైదరాబాద్: ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో 370 సీట్లు లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకెళ్తోంది బీజేపీ. ఏ ఒక్క రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేయకుండా.. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే పనిలో ఉంది పార్టీ అధిష్టానం. తాజాగా దక్షిది రాష్ట్రాలకు గేట్‌వేగా భావిస్తున్న తెలంగాణ పై స్పెషల్ ఫోకస్ పెట్టింది కమలదళం. రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుపొందే లక్ష్యంతో పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా ఆపరేషన్ ఆకర్ష్‌కి తెరలేపింది. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా.. ఇప్పటికే 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది బీజేపీ. పెండింగ్ పార్లమెంట్ స్థానాలపై కసరత్తు చేస్తోంది. అయితే, ప్రకటించిన 9 స్థానాల్లోనూ బలమైన అభ్యర్థులు ఉండగా.. బలహీనంగా ఉన్న చోట చేరికలను ప్రోత్సహిస్తోంది కమలం పార్టీ. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థుల కోసం వేట కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే.. ఖమ్మం పార్లమెంట్ నుంచి పోటీ చేయాల్సిందిగా బీఆర్ఎస్ నేత జలగం వెంకట్రావుకు బీజేపీ ఆఫర్ ఇచ్చింది. మరో బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సీతారం నాయక్‌ను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కలిశారు. ఆయన్ను బీజేపీలోకి ఆహ్వానించారు. మహబూబాబాద్ టికెట్‌ను సీతారాం నాయక్‌కు ఇస్తామని ఆఫర్ ఇచ్చింది బీజేపీ నాయకత్వం. ఇక పెద్దపల్లి పార్లమెంట్ సీటును కళాకారుడు మిట్టపల్లి సురేందర్‌కు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన నల్లగొండ, వరంగల్ స్థానాల కోసం బీఆర్ఎస్ నేతలకు గాలం వేస్తోంది బీజేపీ. మహబూబ్‌నగర్ సీటు కోసం డీకే అరుణ, జితేందర్ రెడ్డి, శాంతకుమార్ మధ్య పోటీ నెలకొనగా.. మెదక్ సీటు కోసం రఘునందనరావు, గోదావరి అంజిరెడ్డి పోటీ పడుతున్నారు. సోయం బాపూరావు, సోలంకి శ్రీనివాస్, అభినవ్ సర్దార్‌లు ఆదిలాబాద్ సీటును ఆశిస్తున్నారు.

# 'ఆప్' ప్రచారం మొదలైంది...




న్యూఢిల్లీ: రెండు రాష్ట్రాల్లో అధికారం, పలు రాష్ట్రాల్లో ఉనికిని చాటుకుని జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన 'ఆమ్ ఆద్మీ పార్టీ' లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టుంది. డీడీయూ మార్గ్‌లోని ఆప్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రారంభించారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీగా ఆప్ ఇప్పటికే కాంగ్రెస్‌తో ఢిల్లీ, గుజరాత్, హర్యానాలో పొత్తులు ఖరారు చేసింది.

**పార్లమెంటులో మరింత బలపడదాం...**

ఢిల్లీ ప్రజలంతా తన కుటుంబ సభ్యులనీ, ప్రజా సేవకు అంకితమై పని చేస్తున్నామని కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. పార్లమెంటులో బలపడటం ద్వారా ఢిల్లీ ప్రజల అభ్యుదయానికి మరింత పాటుపడగలమని, ఇందుకు పట్టుదలగా పనిచేయాలని కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. కూటమి పొత్తుల్లో భాగంగా ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాల్లో 4 స్థానాల్లో ఆప్, 3 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ పొత్తుతో గుజరాత్‌లోని బరూచ్, జామ్‌నగర్, హర్యానాలోని కురుక్షేత్ర నుంచి ఆప్ పోటీ చేస్తోంది. పంజాబ్‌లో ఆప్ పొత్తులు లేకుండా పోటీ చేస్తోంది. అసోంలోని గువాహటి, డిబ్రూగఢ్, సోనిపట్ లోక్‌సభ నియోజకవర్గాలకు కూడా ఆప్ తమ అభ్యర్థులను ప్రకటించింది. 18వ లోక్‌సభ ఎన్నికు ఏప్రిల్–మే నెలల్లో జరుగనున్నాయి. 17వ లోక్‌సభ గడవు జూన్ నెలాఖరుతో ముగియనుంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, మోదీ వరుసగా రెండోసారి ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టారు.

# మే 10న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు



డెహ్రాడూన్: హిమాలయాలలో కొలువై ఉన్న కేదార్‌నాథ్ ఆలయ తలుపులు భక్తుల సందర్శనార్థం మే 10వ తేదీ ఉదయం 7 గంటలకు తెరుచుకుంటాయని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ(బికెటిసి) ప్రకటించింది. ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర్ ఆలయ వద్ద బికెటిసి చైర్మన్ అజేంద్ర అజయ్ ఈ విషయం వెల్లడించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com